

22న ఓటర్ల తుది జాబితా విడుదల

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియ ముగియడంతో ఓటర్ల జాబితాల ముద్రణ సాగుతుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి పోలింగ్ బూత్‌కు 12 సెట్ల జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఈసీ గుర్తించిన ఏడు రాజకీయ పార్టీలకు, ఎన్నికల అధికారులకు ఒక్కో సెట్ అందజేస్తారు. కలెక్టర్ కార్యాలయంలో ఒకటి ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. ఈసీ వెబ్‌సైట్‌లో బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంచనున్నారు.

తాడి నెత్తిన మరో కుంపటి

ఫార్మా సిటీ కాలుష్యంతో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరవుతున్న గ్రామం

- తరలించాలని ఎప్పటినుంచో డిమాండ్
- ఇదిగో..వారం రోజుల్లో నిధులు విడుదల చేస్తానన్న సీఎం
- ఏడాదైనా నెరవేరని హామీ
- గ్రామానికి ఒక వైపున ఇప్పటికే ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు
- దాంతో తాడి పరిసరాల్లో భూగర్భ జలాలు కలుషితం
- ఇప్పుడు మరొక ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదన
- 30న పరవాడలో ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రజల ఆరోగ్యం కంటే రాంకీ ప్రయోజనాలే ముఖ్యమా!?
- గ్రామస్థుల ఆందోళన


తాడి గ్రామానికి ఎడమ వైపున ఉన్న ఘన వ్యర్థాల ప్లాంటు

విశాఖపట్నం/పరవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

"కాలుష్యంతో ఇబ్బందిపడుతున్న తాడి గ్రామాన్ని తరలిస్తాం. గ్రామ తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు వారం రోజుల్లో విడుదల చేస్తాం."

- ఇదీ 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీకి శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు సరికదా...గామానికి మరోవైపు మరొక ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెల 30వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ జరగనున్నది.


పరవాడ మండలంలో గల రాంకీ ఫార్మాసిటీలోని బల్క్ డ్రగ్ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో సమీపంలో గల తాడి గ్రామం ఇబ్బందిపడుతుంది. ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుతో చివరకు గ్రామ పరిసరాల్లో భూగర్భ జలాలు కూడా కలుషితమైపోయాయి. కాలుష్యం నుంచి తమను రక్షించాలని గ్రామస్థులుగా దశాబ్దాలుగా కోరుతున్నారు. అయితే ఆ దిశగా ఎటువంటి ఆలోచన చేయకపోగా గ్రామానికి మరో వైపున ఇంకొక ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదించడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది.

పరవాడ రాంకీ ఫార్మాసిటీలోని పరిశ్రమల నుంచి విడుదలైన ఘన వ్యర్థాల నిల్వ కోసం తాడి రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 119లో సుమారు 50 ఎకరాల్లో ప్లాంటు ఏర్పాటుకు ఈనెల 30న పరవాడలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. రాంకీ ఫార్మా సిటీలో గల 100కుపైగా బల్క్ డ్రగ్ కంపెనీల నుంచి ద్రవ, ఘన వ్యర్థాలు విడుదలవుతుంటాయి. రెండింటి నిర్వహణ బాధ్యత రాంకీ ఫార్మాసిటీ యాజమాన్యానిదే. ద్రవ వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంటులో శుద్ధి చేసి సముద్రంలోకి విడిచిపెడుతుంటారు. ఘన వ్యర్థాలను ల్యాండ్ ఫిల్ కోసం తాడి గ్రామానికి ... మిగతా 6వ పేజీలో

నేడు చంద్రబాబు రాక

- అల్లూరి జిల్లాలో పర్యటన

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో శనివారం 'రా...కదలిరా' నినాదంతో నిర్వహించనున్న బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఆయన శనివారం ఉదయం 10.10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు నుంచి 11.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30 గంటలకు డుంబ్రిగుడ మండలం అరకు చేరుకుంటారు. 11.40 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభలో ప్రసంగిస్తారు. అనంతరం స్థానిక నాయకులతో కొద్దిసేపు మాట్లాడతారు. తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట వెళతారు.

భారీ ఏర్పాట్లు

అరకులోయ సమీపంలోని డుంబ్రిగుడ మండలం అరకు గ్రామం వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తదితరులు శుక్రవారం అరకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు.

21న అనుచరులతో సమావేశం

- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ



గోపాలపట్నం, జనవరి 19: రాష్ట్రాభివృద్ధితో పాటు విశాఖ స్టీల్‌ప్లాంటు, పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోన్, ఉత్తరాంధ్ర సృజల స్రవంతి వంటి పలు అంశాలపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో చర్చించినట్టు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఆయన శుక్రవారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయపరంగా నిర్ణయం తీసుకోవాలంటూ తన శ్రేయోభిలాషులు, అభిమానులు చాలాకాలంగా కోరుతున్నారన్నారు. ఈ నెల 21న అనకాపల్లిలో అందరితో సమావేశమై వారి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని పార్టీలో చేరికపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్నట్టు కొణతాల చెప్పారు.

వీఎస్ఎస్‌పై భగ్గుమంటున్న ఉక్కు

కార్మికులను తగ్గిస్తే పూర్తిస్థాయి ఉత్పత్తి ఎలా?

ఉక్కు మంత్రిత్వ శాఖ నిర్ణయంపై గుర్తింపు సంఘం ఆగ్రహం

- నష్టాలకు బోర్డు నిర్ణయాలే కారణం తప్ప ఉద్యోగులు కాదని లేఖ
- వెంటనే వలంటరీ సెల్ఫ్ సెపరేషన్ స్కీమ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారంపై భారం తగ్గించేందుకు ఉద్యోగుల సంఖ్యలో కోత విధించాలని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ చేస్తున్న యత్నాలపై గుర్తింపు సంఘం మండిపడుతోంది. ఎవరితో చర్చించకుండా వీఆర్ఎస్‌కు బదులుగా వలంటరీ సెల్ఫ్ సెపరేషన్ స్కీమ్ (వీఎస్ఎస్) పెట్టి 1,500 మందిని ఇంటికి పంపించడానికి జరుగుతున్న ప్రయత్నాలపై విశాఖ స్టీల్ వర్కర్స్ గుర్తింపు యూనియన్ స్పందించింది. అదే జరిగితే ఆందోళనలు తప్పవని కేంద్ర ఉక్కు సెక్రటరీకి ఓ లేఖ రాసింది. ప్లాంటును పూర్తిస్థాయిలో నడపాలని యాజమాన్యం యత్నిస్తున్న సమయంలో ఉద్యోగుల సంఖ్యను ఎలా తగ్గిస్తారని ప్రశ్నించింది.

ఆనాడు ఏమి జరిగిందంటే..?

విశాఖ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 3.2 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు పెంచాలని 2005లో విస్తరణ పనులకు ప్రతిపాదించినప్పుడు నాటి ప్లానింగ్ కమిషన్‌తో పాటు పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం కలిసి అదనంగా 1,900 మంది ఉద్యోగులను నియమించుకోవడానికి అనుమతి ఇచ్చాయి. అంతేకాకుండా ఆనాటికి ఉన్న మానవ వనరుల్లో 14 శాతం మందిని విస్తరణ యూనిట్లకు కేటాయించాలని పేర్కొంటూ, ప్లాంటు నిర్వహణ పనులను అవుట్ సోర్సింగ్ చేయాలని సూచించింది. అలాగే అప్పటికే విశాఖ ఉక్కు యాజమాన్యం అమలుచేసిన వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్‌ను ఆపేయాలని ఆదేశించింది. అదనపు ఉద్యోగులు అవసరమైన రీత్యా ఎవరికీ వీఆర్ఎస్ ఇవ్వవద్దని స్పష్టంచేసింది.

2018 నుంచి ఆగిన నియామకాలు

ప్లాంటు విస్తరణ పనులు పూర్తయ్యేసరికి కొత్త ఉద్యోగులను తీసుకోవలసి ఉండగా యాజమాన్యం 2018 నుంచి రిక్రూట్‌మెంట్ నిలిపివేసింది. ఇప్పటివరకు కొత్త వారిని తీసుకోలేదు. ఈలోగా ఉన్న ఉద్యోగుల్లో సుమారు 20 శాతం మంది పదవీ విరమణ చేశారు. అంటే కొత్తవారు రాలేదు సరికదా...ఉన్నవారిలో 20 శాతం తగ్గిపోయారు. ఈ నేపథ్యంలో మూతపడిన బ్లాస్ట్ ఫర్నేస్-3ను ఇటీవల వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్లాంటును పూర్తిస్థాయిలో పనిచేయించి, 100శాతం ఉత్పత్తి చేస్తామని సీఎండీ అతుల్ భట్ పదేపదే చెబుతున్నారు. ఇటువంటి సమయంలో ఉద్యోగులు చాలా కీలకం. అవసరమైతే ఇంకా కొత్తవారిని తీసుకోవలసి ఉంటుంది. కానీ అలా చేయకుండా అనారోగ్యం పేరుతో కొంతమందిని, కొత్త పథకం వీఎస్ఎస్ పేరుతో మరి కొంతమందిని తీసేయాలని ఉక్కు మంత్రిత్వ శాఖ ఒత్తిడి పెడుతోంది. అదే జరిగితే పూర్తిస్థాయి ఉత్పత్తి ఎలా చేస్తారని కార్మిక సంఘాలు, ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

బోర్డు నిర్ణయాల వల్లే నష్టాలు

విశాఖ ఉక్కు కర్మాగారం నష్టాల బారిన పడడానికి బోర్డు, యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలే కారణం తప్ప ఉద్యోగులు, వారి సంఖ్య కాదని ఉక్కు మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో గుర్తింపు యూనియన్ ఆరోపించింది. ప్లాంటు పూర్తిస్థాయిలో ... మిగతా 6వ పేజీలో

సిటీలో చిరంజీవి


విమానాశ్రయంలో చిరంజీవికి స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి గంటా, తదితరులు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు చిరంజీవి శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం వచ్చారు. రుషికొండలోని ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగే లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ఆయన్ను ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి ఆయనతో పాటు అదే విమానంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా వచ్చారు. చిరంజీవి రాడిసన్ బ్లూ హోటల్‌లో బస చేయగా, లోక్‌నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, హోటల్ యజమాని ఉమేశ్, తదితరులు కలిసి మాట్లాడారు.

రాజ్యాంగ నిర్మాతకు వినతి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి, నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సమస్యల పరిష్కారం కోసం 39 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. నిరసనలో భాగంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీగా చేరుకుని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరారు. - Iలో

ఈపీడీసీఎల్ ఇన్‌చార్జి సీఎండీగా చంద్రం

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సీఎండీ పృథ్వీతేజ్ వ్యక్తిగత పనిపై సెలవులో వెళ్లడంతో ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రంకు ఇన్‌చార్జి సీఎండీగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పృథ్వీతేజ్ తిరిగి విధుల్లో చేరేంత వరకు చంద్రం అన్ని వ్యవహారాలు చూస్తారు. విధుల్లో భాగంగా చంద్రం, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ సూర్యప్రతాప్‌తో కలిసి ఢిల్లీ సమావేశానికి వెళ్లారు.

ఆర్ఐవో పోస్టుకు పోటీ

- నెలాఖరుకు ప్రస్తుత ఆర్ఐవో పదవీ విరమణ

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) రాయల సత్యనారాయణ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనుండడంతో ఆ పోస్టు కోసం పలువురు పోటీ పడుతున్నారు. విశాఖ జిల్లా వృత్తివిద్యాశాఖాధికారిణి రాధ, అనకాపల్లి జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి, వీఎస్ కృష్ణా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, గతంలో విశాఖలో ఆర్ఐవోగా పనిచేసిన ఉమారాణితోపాటు ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లో పలు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు... ఆర్ఐవో పోస్టు కోసం పోటీలో ఉన్నారు. నిబంధనల ప్రకారం అయితే జోన్-1లో సీనియారిటీ ప్రాతిపదికన ఆర్ఐవో పోస్టు భర్తీ చేయాలి. కానీ ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న అధికారులకే ఆర్ఐవో పోస్టులు కట్టబెట్టడం ఇటీవల కాలంలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరికి వారు మంత్రులతో సిఫారసులు చేయించుకుంటున్నారు. అయితే నెలాఖరుకు పదవీ విరమణ చేస్తున్న ప్రస్తుత ఆర్ఐవో సత్యనారాయణ కూడా ఇంటర్ పరీక్షలు ముగిసే వరకు సర్వీస్ పొడిగించాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, వచ్చే నెలలో ఇంటర్ ప్రాక్టికల్స్, మార్చి నెలలో థియరీ పరీక్షలు జరగనున్నందున ఆర్ఐవో పోస్టును వెంటనే భర్తీ చేసే అవకాశం ఉంది.

ముగ్గురు ఏఎంసీ వైద్యులకు పదోన్నతులు


డాక్టర్ ఎం.ఎస్.రాజు


డాక్టర్ విశ్వామిత్ర

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లకు అడిషనల్ డైరెక్టర్లుగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఏఎంసీ పరిధిలోని ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి.విశ్వామిత్రకు అడిషనల్ డైరెక్టర్‌గా ... మిగతా 6వ పేజీలో

అయ్యో... పాపం

ఆ కుటుంబాన్ని వెంటాడుతున్న రోడ్డు ప్రమాదాలు

- దువ్వాడ సమీపంలో బైక్‌ను ఢీకొన్న టిప్పర్
- యువకుడు, అతడి అన్న కుమార్తె మృతి
- ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలోనే పెద్ద కుమారుడు దుర్మరణం
- ...ఇప్పుడు చిన్న కుమారుడు, మనమరాలు... భోరుమన్న వృద్ధ దంపతులు


కొల్లి వెంకట ప్రసాద్ (ఫైల్‌ఫొటో)


హంసిని (ఫైల్‌ఫొటో)

కూర్మన్నపాలెం, జనవరి 19:

ఆ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదాలు వెంటాడుతున్నాయి. సరిగ్గా ఐదేళ్ల కిందట పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలోనే అశువులు బాయగా, శుక్రవారం రెండో కుమారుడు, మనుమరాలు అదేరీతిలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారి రోదన వర్ణనాతీతంగా ఉంది. దువ్వాడ నాగదేవత కొండ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కలిగొట్లలో నివాసం ఉంటున్న కొల్లి పద్మ తన కుమార్తె హంసిని (8)తో కలిసి సంక్రాంతికి గాజువాక చిట్టినాయుడు కాలనీలో గల అత్త వారింటికి వచ్చింది. పండుగ అయిపోయిన తరువాత హంసినిని పద్మ తన అత్తింటి వద్ద వదిలిపెట్టి కలిగొట్ల వెళ్లింది. శుక్రవారం సాయంత్రం హంసినిని తీసుకుని ఆమె బాబాయి కొల్లి వెంకటప్రసాద్ (31) ద్విచక్ర వాహనంపై కలిగొట్ల బయలుదేరాడు. వీరి వాహనాన్ని నాగదేవత కొండ సమీపంలో టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. సంఘటనా స్థలాన్ని ఏడీసీపీ, ఏసీపీ సందర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు పెద్ద కొడుకు...నేడు చిన్న కుమారుడు, మనుమరాలు

అచ్యుతాపురం సమీపంలోని దొప్పెర్లకు చెందిన కొల్లి పైడిరాజు 30 ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం ఆటోనగర్ ప్రాంతానికి వచ్చారు. ఆయన భార్య దేముడమ్మ, వీరికి శివ, వెంకటప్రసాద్, శాంతి పిల్లలు. వీరిలో పెద్దకుమారుడు శివకు దేవరాపల్లి మండలం కలిగొట్లకు చెందిన పద్మతో ... మిగతా 6వ పేజీలో

మూడేళ్లు ఒకే చోట పనిచేసిన అధికారులకు బదిలీ

›› రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా

మహారాణిపేట, జనవరి 19: రాష్ట్రంలో లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాల్గొనే అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసిన అధికారులను మరో జిల్లాకు బదిలీ చేయాలని సూచించారు. శుక్రవారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌నుంచి జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్‌తో సహా పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు అవసరమైన పరిశీలకులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది నియామకంపై చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

22న ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మురళీనగర్, జనవరి 19 ; అయోధ్య శ్రీరామ మందిరంలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్ రామాలయంలో 22వతేదీ సోమవారం ప్రత్యేక అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధ్యక్షులు టి.ఎస్.రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రామ రక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా ఆరాధన కార్యక్రమాలను లలిత భక్త మండలి అధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. 11 గంటలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సత్సంగ్ బృంద సభ్యులు మధ్యాహ్నం 1గంట వరకు శ్రీరామ నామ భజన కార్యక్రమం చేపడతారని అన్నారు. సాయంత్రం మందిరందీపాలంకరణ చేసి సీతారాములకు ప్రత్యేక దర్శనాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కులగణన సర్వే ప్రారంభం



చిన్నారులో ఫేషియల్ తీస్తున్న సెక్రటరీలు

అక్కయ్యపాలెం, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ప్రక్రియలో భాగంగా అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, దొండపర్తి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సర్వే ప్రారంభమైంది. ఈ నెల 29వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుంది. ఈ మేరకు సచివాలయాల సెక్రటరీలు ఇంటింటికి వెళ్లి బయోమెట్రిక్, ఫేషియల్, ఐరీస్ ద్వారా సర్వే కులగణన సర్వే చేపట్టారు. అయితే, సర్వర్ మొరాయించడంతో సర్వే అంతంతమాత్రంగానే సాగింది. గ్రేటర్ 26వ వార్డులో 19 క్లస్టర్స్ ఉన్నాయి. ఎనిమిది మంది సెక్రటరీల ఆధ్వర్యంలో ఈ కులగణన సర్వే జరిగింది. గ్రేటర్ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెం సచివాలయం పరిధిలో 17 క్లస్టర్స్ లో ఎనిమిది మంది సెక్రటరీలు కులగణన సర్వే చేస్తున్నారు. మిగతా వార్డుల్లోనూ సర్వర్ మొరాయించడంతో సర్వే ఆలస్యంగా అవుతోంది.

అలరించిన 'గుర్తుకొస్తున్నాయి'



బృంద గానంలో ఆలపిస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, జనవరి 19: మెలోడీ క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి , కళాంజలి సరిగమప సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గుర్తుకొస్తున్నాయి సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కే.శిరీష, వంకాయల సన్యాసిరాజు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం సీహెచ్‌వీ సత్యనారాయణ, కడలి , ఎంపీ రాజశేఖర్, వి.ప్రభాకర్ , వీవీ చారి, సురేష్ కన్నా, సత్యవతి, జ్యోతి, సత్యశ్రీ, లక్ష్మీ సాత్విక, నిషత తెలుగు చలన చిత్రాల గీతాలను ఆలపించారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ మాధవ్, పుండరీ కుమార్, ఫణిస్వామి, కొణతాల రాజు, ఎస్.విజయ్‌కుమార్, సన్‌మూర్తి, మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు చేరాలి; జెడ్సీకృష్ణ



మాట్లాడుతున్న జెడ్సీ ఆర్జీవీ కృష్ణ

మాధవధార, జనవరి 19; ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సిబ్బంది, అధికారులు దృష్టి సారించాలని జోన్-5 జెడ్సీ ఆర్జీవీ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మాధవధారలోని జీవీఎంసీ మాధవస్వామి కల్యాణమండపంలో యూసీడీ విభాగం ద్వారా అమలవుతున్న వివిధ పథకాలపై సిబ్బందికి అవగాహన సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హాజరైన జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు, జోన్-5 ఏపీడీ పద్మావతి ఆర్పీలు, సచివాలయ సిబ్బందికి పథకాలపై అవగాహన కల్పించారు. పలువురు సిబ్బంది అడిగిన సందేహాలను ఈ సందర్భంగా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు చిరంజీవి, నాగరాజు తదితరులు ఉన్నారు.

మైదానం నిర్వహణపై అధికారం ఇచ్చారు..

రైల్వే న్యూ కాలనీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

అక్కయ్యపాలెం, జనవరి 19: రైల్వే న్యూకాలనీలోని కేఎస్ఎం పాఠశాల మైదానం నిర్వహణకు 2014లో అప్పటి జీవీఎంసీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ తమకు అధికారం ఇచ్చినట్టు రైల్వేన్యూకాలనీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్ చలం, ఎం.సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ అధికారులనుంచి మౌఖిక ఆదేశాలు తీసుకున్న తర్వాత రైల్వే న్యూకాలనీ వాకర్స్ వెల్ఫేర్ కమిటీ సొంత సహకారంతో మైదానాన్ని నిర్వహణను చేపడుతున్నట్టు వివరించారు. అప్పటినుంచి మైదానం శుభ్రత, నిర్వహణ కోసం ముగ్గురిని నెలవారీ వేతనాలపై విధుల్లో చేర్పించినట్టు చెప్పారు. కాలనీలోని స్థానికులు స్వచ్ఛందంగానే మైదానం నిర్వహణకు నెలకురూ.100 ఇస్తున్నారని, ఎవరినీ బలవంతం చేయడం లేదన్నారు. మొక్కలకు నీరు, ఫెన్సింగ్, బుద్ధుని విగ్రహం ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్ట్, వాలీబాల్ కోర్ట్, మూడు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు తదితర పనులను స్థానికుల విరాళాలు, సహకారంతో చేపడుతున్నట్టు వారు వివరించారు.

ప్రజాకవి వేమన



ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

జ్ఞానాపురం, జనవరి 19: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం ప్రజాకవి వేమన జ యంతిని వేమన ఫౌండేషన్ సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి, ప్రిన్సిపాల్ డా సిస్టర్ షైజీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ , పామరులకు కూడా అర్థమయ్యే సరళ వాడుక భాషలో తన పద్యాలను రాసిన వేమన చిరస్మరణీయులన్నారు. వందల ఏళ్లయిన ప్రజల్లో ఆయన కవిత్వం నిలిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలోడా.వీకే జయలక్ష్మీ, డా.జె.నిర్మల,డా. కె.గౌరి నాయుడు, డాక్టర్ దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, సిస్టర్ జైన్ పాల్గొన్నారు.



రెల్లివీధిలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట గండి బాబ్జీ ఆధ్వర్యంలో నిరసన



తాటిచెట్లపాలెంలో నిరసన చేపడుతున్న టీడీపీ నాయకులు

జగన్ దళిత ద్రోహిగా మిగిలిపోతారు

›› 'దక్షిణ' ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దళిత ద్రోహిగా మిగిలిపోనున్నారని, టీడీపీ దక్షిణ నియోజక వర్గ ఇన్ చార్జి గండి బాబ్జీ అన్నారు. కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనుకు న్యాయం జరగాలని కోరుతూ శుక్ర వారం రెల్లివీధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్య మంత్రి జగన్ దళితులకు అన్యా యం చేసి... మరోవైపుఅంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరించి ఆ పాపాలు కడుక్కోవాలనునుకుంటున్నారన్నారు. కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనును ఐదేళ్ల జైల్లో పెట్టారని, ఒకవేళ ఈ కేసులో శిక్ష విధించినా ఇన్నేళ్ల కంటే తక్కువే శిక్ష పడేదని అన్నారు. దళితుడు సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన అనం తబాబును జగన్ పక్కన పెట్టుకున్నారన్నారు.మాస్కు అడిగిన డాక్టర్ సుధాకర్‌ను మానసి కంగా హింసించి చంపారన్నారు. బాబాయి వివేకానందరెడ్డిని చంపిన నిందితులను కాపాడుతున్నారని బాబ్జీ ఆరోపించారు.ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ తన కళాశాలలో మద్యం పంపిణీ చేయడంపై కలెక్టర్ కూడా ఫిర్యాదు చేసి నట్టు చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుదేశం అధికారంతో ప్రజల జీవితాల్లో మార్పు

పూర్ణామార్కెట్: రాష్ట్రంలో తెలుగుదేశం గెలుపుతోనే ప్రజల జీవితాల్లో మార్పుసాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం 36వ వార్డులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి తేవాల్సినఅవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కె.గణపతి, క్లస్టర్ ఇన్ చార్జి కేదారి లక్ష్మి, బూత్ అధ్యక్షుడు భద్రరావు, పార్టీ సీనియర్లు శ్రీనివాస్ రామిరెడ్డి, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో దళితులపై దమనకాండ

అక్కయ్యపాలెం: వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై దమనకాండ సాగుతోందని ఉత్తర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విజయ్‌బాబు అన్నారు. జైల్లో ఉన్న కోడికత్తి శ్రీనుకు మద్దతుగా తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుక్కళ్ళ పైడికొండ, పామోటి బాబ్జి, కొయిలాడ వెంకటేష్, అకిరెడ్డి జగదీష్, వాసుపల్లి రాజు, యాగాటి ఆదిలక్ష్మి, బొడ్డేటి మోహన్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం

›› లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

సీతంపేట, జనవరి 19: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఉత్తరాంధ్రకి తీరని అన్యాయం జరిగిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు. నలుగురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తూన్నా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.ఉత్తరాంధ్రకు అభివృద్ధి చేస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి జగన్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. ఇప్పుడు ఈ నెల 25వ తేదీ నుంచి సీఎం జగన్‌ప్రచార యాత్ర ఉత్తరాంధ్రనుంచి ప్రారంభిస్తారని చెబుతున్నారన్నారు. ఉత్తరాం ధ్రలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయలేకపోయారన్నారు. మూతపడిన ఏటికొప్పాక, తండావ, అనకాపల్లిన భీమసింగి సహకార చక్కెర ఫ్యాక్టరీలుతెరిపించలేకపోయారన్నారు. ఎంతో ప్రాముఖ్యమైన అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో లక్ష దిమ్మలు వచ్చేవని, ఈ రోజు వెయ్యికి పడిపోతే.. ప్రభుత్వం ఏమీ చేసిందన్నారు. కేజీహెచ్‌లో ఆధునిక పరికరాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. కొత్త పరిశ్రమలు రాక నిరుద్యోగులకు ఉపాధి కరువైందన్నారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, మెట్రో రైల్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీలు ఏమయ్యాయని బాబ్జీ నిలదీశారు. ఇవేమీ చేయకుండా ఎన్నికలకు సిద్ధం కావడం సిగ్గుచేటలన్నారు.ఈ స్థితిలో ఆ పార్టీనేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.పార్టీ నేతలు ఎంఎస్ఎన్ మూర్తి, రామకృష్ణపాల్గొన్నారు.

కుంచుమాంబ ఉత్సవాలు ప్రారంభం



కుంచుమాంబకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

పూర్ణామార్కెట్, జనవరి 19: జీవీఎంసీ 30వ వార్డు రెల్లి వీధిలోని కుంచుమాంబ అమ్మవారి పరస మహోత్సవాన్ని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరంఅమ్మవారికి పూజలు జరిపారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ కా ర్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు నిమ్మకాయల శి వాజీ మాణిక్యాలరావు, చిన్ని పాల్గొన్నారు.

పోలమాంబ ఉత్సవాలకు పందిరిరాట

జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధి ప్రాంతవాసుల ఆరాధ్యదైవం పోలమాంబ ఉత్సవాలకు సంబంధించి శుక్రవారం పందిరాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చరణ, వాయిద్యమేళాల మధ్య రాట వద్ద ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం గుడి వద్ద మహిళలు రాటను నిలిపారు. రాటకు పూజలు నిర్వహించారు. ఈనెల 22నుంచి 24 వతేదీ వరకు ఈ ఉత్సవాలు సాగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా టోల్ వసూలు

›› జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సీతంపేట, జనవరి 19: టోల్‌గేట్ పేరుతో మాఫియా నగరవాసులను దోపిడీ చేస్తోందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో నుంచి వెళ్లే రహదారికి ప్రత్యామ్నాయంగా అనకాపల్లి- ఆనందపురం రహదారి నిర్మించారని, దానిని జాతీయ రహదారిగా గుర్తించి, రెండు టోల్‌గేట్లను ఏర్పాటు చేసి వసూళ్లు ప్రారంభించారన్నారు. నగరంలోని రోడ్డుకు హైవే హోదాను తీసివేస్తూ గెజిట్ కూడా జారీ చేశారన్నారు. అయినా అగనంపూడి వద్ద టోల్ వసూలు ఆగడం లేదన్నారు. అగనంపూడి టోల్ గడువు ఎప్పుడో ముగిసిపోయిందని, రహదారి నిర్వహణ బాధ్యతను జీవీఎంసీ తీసుకున్నా దోపిడీ కొనసాగుతోందన్నారు. మాఫియాతో చేతులు కలిపిన అధికార పార్టీ నేతలు దోచుకుంటున్నారన్నారు. దేశంలో అతి తక్కువ టోల్‌గేట్లు తమిళనాడు, గుజరాత్‌లో ఉండగా, ఎక్కువ గేట్లు ఏపీలో ఉన్నాయన్నారు. అగనంపూడి టోల్‌గేట్ కొనసాగడంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మంత్రి అమర్‌నాథ్, గాజువాక ఎమెల్యే తిప్పల నాగిరెడ్డి బాధ్యులన్నారు. విశాఖను దత్తత తీసుకున్నానని ప్రకటించుకుంటున్న ఓ బీజేపీ ఎంపీ, కేంద్రంలో చక్రం తిప్పిన నేతలు కూడా దీనిని పట్టించుకోవడం లేదన్నారు. అగనంపూడి టోల్ గేట్‌ను వెంటనే తొలగించకుంటే కేంద్ర ప్రభుత్వంతో పాటు న్యాయ స్థానాన్ని ఆశ్రయించి నగర వాసులకు ఉపశమనం కల్పిస్తామన్నారు. సమావేశంలో దల్లి గోవింద్‌రెడ్డి, నాగలక్ష్మి చౌదరి, త్రివేణి, వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్'

అల్లిపురం, జనవరి 19: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నియోజకవర్గంలో వారంలో రెండు రోజులపాటు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం 34వ వార్డులోని మనోరమ థియేటర్ వద్ద 32,33,34వ వార్డుల్లోని ప్రజలకు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 20 వినతులు

మహారాణిపేట, జనవరి 19: పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గీవెన్స్‌కు 20 వినతులు వచ్చాయి. సీపీ ఏ రవిశంకర్ ఈ వినతులు స్వీకరించారు.అనంతరం పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

22 తేదీన సెలవు ప్రకటించాలి

›› బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జనవరి 19: అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు నేపథ్యంలో 22న అన్ని రాష్ట్రాల్లోలానే ఆంధ్రప్రదేశ్ లోనూ సెలవు ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు కోరారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆంధ్రప్రదేశ్‌లో హిందువుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌పై ఉందన్నారు. 500 వందల ఏళ్ల పోరాట ఫలితంగా నిర్మించిన రామమందిరం ప్రారంభోత్సవానికి సెలవు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. దీనిని వీ క్షించడానికి రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు.

దొంగ ఓట్లపై ఫిర్యాదు

రాష్ట్ర వ్యాప్తంగా దొంగ ఓట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కి వినతిపత్రం సమర్పించినట్టు విష్ణుకుమార్ రాజు తెలిపారు. తిరుపతిలో ఏ విధంగా 30 వేల దొంగ ఓట్లు బహిర్గతమయ్యాయో అలాగే, 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దొంగ ఓట్లు ఉన్నట్లు గమనించి కమిషన్‌కి పత్రాలను ఇచ్చామన్నారు. 2024 సాధారణ ఎన్నికలలో 110 స్థానాల్లో తిరుపతి తరహా కుట్రకు జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు 17 సీట్లు కూడా రావన్నారు. జగన్ రాష్ట్రంలో ప్రజల నుంచి దోచుకున్న సొత్తుతో ఎన్నికలకు పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. నాయకులు పరశురామ్‌రాజు, సురేష్‌బాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో ఆలయ ప్రారంభం ఆహ్వానించదగినదే..

›› కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి

డాబాగార్డెన్స్, జనవరి 19: ప్రపంచంలో ఉండే హిందువులంతా ఆదర్శ పురుషుడిగా కొలిచే శ్రీరాముడి ఆలయం అయోధ్యలో ప్రారంభం కోసం పార్టీలకు అతీతంగా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి అన్నారు. అయితే, శాస్త్రోక్తంగా పీఠాధిపతుల సమక్షంలో ప్రారంభించాల్సి ఉన్నా, ప్రస్తుతం ఇంకా నిర్మాణంలోనే ఉండగా ఎన్నికల ముందు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా ప్రాణ ప్రతిష్ఠకు ఉత్సాహం చుపుతుండడాన్ని ప్రతిపక్షాలతోపాటు పీఠాధిపతులు తప్పుపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. కొద్ది నెలల్లోనే ఆలయం పనులు పూర్తి చేసి ప్రారంభిస్తే.. ఎటువంటి అభ్యంతరం ఉండేదని కాదని తెలిపారు. ఈ ఆలయాన్ని ప్రధాని మోదీ ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించాలని చూడడం ఎన్నికల కోసమేనని ఎవరికైనా అర్థమవుతుందని ఆమె ఆరోపించారు.

వ్యాపారిపై వ్యక్తి దాడి

సీతంపేట, జనవరి 19: నాలుగో పట్టణ పోలీసు స్టేష్ పరిధి తాటిచెట్లపాలెం సూయిజ్ ఫాం వద్ద సమోసా బండి వద్ద ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. సమాచారంమేరకుసీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. సూయిజ్ ఫాం సమీపంలో సాకల జగదీష్ భార్య విమలతో కలిసి సమోసా, జిలేబీల వ్యాపారం చేస్తున్నారు. అక్కడికి సమీపంలో ఉంటున్న షేక్ ఖాజామోహిదిన్‌వచ్చి సమోసాలు కావాలని అడిగాడు. రెండు సమోసాలిచ్చి ఇచ్చి డబ్బులు జగదీష్ అడిగాడు. దీంతో తాను డబ్బులు ఇవ్వనట్టు కనిపిస్తున్నానా అంటూ... బండి అద్దం చేతితో మోహిదీన్ విరగొట్టాడు. విమలపైనా దాడిచేశాడు.ఈ క్రమంలోమోహిదీన్ గాయమైంది. వెంటనే ఎస్ఐ వెంకటరావు మోహిదీన్‌ను అదుపులో తీసుకొని పోలీసు స్టేషన్‌కి తీసుకువచ్చారు. సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

సౌత్‌జోన్ వుమెన్ వన్డే క్రికెట్ జట్టుకు ముగ్గురు ఎంపిక



ఎంపికైన స్నేహ దీప్తి, క్రికెట్ దుర్గ, క్రికెట్ షబ్నమ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 19: సౌత్‌జోన్ సీనియర్ మహిళల వన్డే క్రికెట్ జట్టుకు స్నేహ దీప్తి, ఎం.దుర్గ, ఎండీ.షబ్నమ్ ఎంపికైనట్టు ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి గోపీనాథరెడ్డి తెలిపారు. అలాగే, సౌత్ జోన్ జట్టుకు విశాఖకు చెందిన స్నేహ దీప్తి వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సౌత్‌జట్టుకు ఎంపికైన క్రికెటర్లను ఏసీఏ అధ్యక్షుడు పి.శరత్ చంద్రారెడ్డి అభినందించారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి : యూటీఎఫ్



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

సిరిపురం, జనవరి 19 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ. 18.96 కోట్లను తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూటీఎఫ్ నాయకులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బకాయిల చెల్లింపునకు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకూ చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే ఈనెల 24న జిల్లాస్థాయిలోనూ, 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రంలో దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు టి. అప్పారావు, పైడిరాజు, రొంగలి ఉమాదేవి, కె. రాంబాబు, సత్యం, రియాజ్ అహ్మద్, జగన్, రాంబాబు, రాజు, ప్రసాద్, సత్యనారాయణ, శోభా, హాక్, రామేశ్వరి పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు.. దారి మళ్లింపు

విశాఖపట్నం, జనవరి 19: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడిపిస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే.త్రిపాఠి తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవీ..

ఈనెల 19వతేదీ నుంచి ఫిబ్రవరి 25 వరకు గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 26 వరకు విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240) రద్దు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకు మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), కాకినాడ-విశాఖ పాసింజర్ రైలు (17267) రద్దు చేశారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 26వరకు విశాఖ-మచిలీపట్నం(17220), విశాఖ-కాకినాడ పాసింజర్ (17268) రద్దు.విశాఖ-విజయవాడ/ గుంటూరు-విశాఖ మధ్య నడిచే 22701, 22702 నంబర్లు గల ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 19, 20, 22, 23, 24, 26, 27 తేదీల్లో రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

గమ్యం కుదింపు..

గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) ఈనెల 25 వతేదీనుంచి ఫిబ్రవరి 25 వరకు గుంటూరు నుంచి విజయనగరం వరకు, అలాగే, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 26 వరకు విజయనగరం నుంచి గుంటూరుకు నడుస్తుంది. రాయగడ, విజయనగరం మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేశారు.ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకు ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351); ఈనెల 29, ఫిబ్రవరి 5, 12, 19న హటియా-ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837); ఈనెల 30, ఫిబ్రవరి 4, 6, 11, 13, 18, 20, 25, హటియా-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (12835); ఈనెల 31, ఫిబ్రవరి 7, 14, 21న జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్(12376);ఫిబ్రవరి 1, 8, 15, 22న టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111); ఫిబ్రవరి 2, 9, 16, 23న టాటానగర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయని సీనియర్ డీసీఎం పేర్కొన్నారు. కాగా, ఈనెల 22, 29, ఫిబ్రవరి 5, 12, 19న ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); ఈనెల19, 24, 26, 31, ఫిబ్రవరి 2, 7, 9, 14,16, 21, 23వ తేదీల్లో బెంగళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్ (12509); ఈనెల 19, 29, 31, ఫిబ్రవరి 2, 3, 5, 7, 9, 10, 12, 14, 16, 17, 19, 21, 23, 24న ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లకు ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో హాల్ట్ ఉండదని తెలిపారు.

డీఆర్ఎం తనిఖీలు



రాయగడ లెవెల్ క్రాసింగ్ గేట్ వద్ద పరిశీలిస్తున్న డీఆర్ఎం

విశాఖపట్నం, జనవరి 19: వాల్తేరు డివిజన్ పరిధిలోని సింగపూర్ రోడ్డు, రాయగడ సెక్షన్లలో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ శుక్రవారం భద్రతా తనిఖీలు చేశారు. సింగపూర్ రోడ్డు స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, పురోగతిలో ఉన్న భద్రతా నిర్మాణ పనులతోపాటు యార్డులో ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్ (ఓహెచ్ఈ), పాయింట్స్, క్రాసింగ్స్, ట్రాక్ సర్క్యూట్‌కు సంబంధించి వాటిని పరిశీలించారు. అలాగే యార్డు లే అవుట్, ట్రాక్స్ రిలే రూమ్, బ్యాటరీ, సిగ్నల్స్ వంటి భద్రతా అంశాలను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి భద్రతకు పాటిస్తున్న పద్ధతులపై ఆరా తీశారు. ఇక రాయగడ వద్ద గల 252 నంబరు గల లడ్డా-రాయగడ లెవెల్ క్రాసింగ్ వద్ద చెక్ ఇంటర్ లాక్ గేట్ వర్కింగ్, భద్రతా నియమాల అ మలు విధానాలను పాటించారు. గేట్ వద్ద అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. పర్యటనలో డీఆర్ఎంతోపాటు ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు పంపిణీ

అల్లిపురం, జనవరి 19: దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు ఆటో డ్రైవర్లకు శుక్రవారం తన కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ రాష్ట్రంలో ప్రజలు వైసీపీ పాలనకు విసుగుచెందారని, రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని అన్నారు.

ముగ్గురు ఏఎంసీ వైద్యులకు పదోన్నతులు

... 5వ పేజీ తరువాయి

పదోన్నతి కల్పిస్తూ పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. అలాగే, కేజీహెచ్‌లోని పీడియాట్రిక్స్ విభాగాధిపతిగా పని చేస్తున్న ప్రొఫెసర్ ఎంఎస్ రాజుకు పదోన్నతి కల్పించిన ప్రభుత్వం..మదనపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. అనస్థీషియా విభాగాధిపతిగా పని చేస్తున్న డాక్టర్ ఎ.పద్మజను పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది.

వీఎస్ఎస్‌పై భగ్గుమంటున్న ఉక్కు

... 5వ పేజీ తరువాయి

పనిచేయాలంటే వెంటనే రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేసింది.

వీఎస్ఎస్ పథకాన్ని వెనక్కి తీసుకోండి

డి.ఆదినారాయణ, జనరల్ సెక్రటరీ, గుర్తింపు యూనియన్

ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టాలని చూస్తున్న వీఎస్ఎస్ పథకం చాలా దారుణమైనదని, ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వకుండా ఉద్యోగులను అనారోగ్యం పేరుతో తొలగించడానికి కుట్ర చేస్తున్నారని, దానిని తాము ఆమోదించబోమని గుర్తింపు యూనియన్ జనరల్ సెక్రటరీ డి.ఆదినారాయణ స్పష్టంచేశారు. ఆ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తాడి నెత్తిన మరో కుంపటి

... 5వ పేజీ తరువాయి

ఆనుకుని కొండ సమీపంలో ప్లాంట్ ఏర్పాటుచేశారు.

ఒక అంచనా మేరకు ఫార్మాసిటీలోని కంపెనీల నుంచి ప్రతినెలా పది వేల టన్నుల ఘన వ్యర్థాలు తాడి దగ్గర ప్లాంటుకు వస్తున్నాయిఇ. ఒక్క ఫార్మా సిటీ కాకుండా ఉత్తరకోస్తాలోని శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు కెమికల్, డ్రగ్ కంపెనీల నుంచి వచ్చే ఘన వ్యర్థాలు ఈ ప్లాంటుకు తరలిస్తుంటారు. సుమారు పదేళ్ల నుంచి ఘన వ్యర్థాలను తాడి సమీపంలో ల్యాండ్‌ఫిల్ ప్లాంట్‌కు తరలిస్తుండడంతో ప్రస్తుతం పెద్ద కొండలా తయారైంది. ల్యాండ్ ఫిల్ ప్లాంట్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ఆనుకుని మరికొంత భూమి ఆక్రమించుకుని ఘనవ్యర్థాలు నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ల్యాండ్ ఫిల్ ప్లాంట్లు నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా లేని కారణంగా తాడితోపాటు పరిసర గ్రామాలు కాలుష్యం బారిన పడ్డాయి. తాడి గ్రామం అయితే ఇటు ల్యాండ్ ఫిల్ ప్లాంటు, అటు ఫార్మాసిటీ నుంచి వచ్చే కాలుష్యంతో ఉక్కిరిబిక్కిర వుతుంది. గ్రామం చుట్టూ భూగర్భ జలాలు ఎప్పుడో కలుషితమయ్యాయి. భూగర్భ జలాలు వినియోగించరాదని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన నిపుణులు హెచ్చ రించారు. తాడి గ్రామాన్ని తరలించాలని ఏళ్ల తరబడి గ్రామస్థులు పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి మరోవైపుగా 50 ఎకరాల్లో కొత్తగా ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకోసం ఈనెల 30న కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించ నున్నది. మరో ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తాడి వద్ద ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయవద్దని పరవాడ సీపీఎం నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించకుండా కొత్తగా ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయడం దారుణమన్నారు. తాడి గ్రామాన్ని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీ శంకుస్థాపన సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు కాలేదు సరికదా తిరిగి గ్రామం నెత్తిన మరో కుంపటి పెడుతున్నారని ఆరోపించారు.

అయ్యో...పాపం

... 5వ పేజీ తరువాయి

వివాహమైంది. వారికి ఓ కుమార్తె హంసిని (8) ఉంది. కాగా శివ ఐదేళ్ల క్రితం దొప్పెర్ల వెళుతూ దేశపాత్రునిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి అతడి భార్య పద్మ తన కన్నవారింట ఉంటోంది. రెండో కుమారుడు వెంకటప్రసాద్ ఫార్మా కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. అతడికి తన మామ కుమార్తెతో ఇటీవల వివాహం నిశ్చయమైంది. మరో మూడు నెలల్లో పెళ్లి జరగనుంది. ఈ లోగా తన అన్న కుమార్తెను ఆమె తల్లి దగ్గరకు తీసుకువెళుతుండగా జరిగిన ప్రమాదంలో వెంకటప్రసాద్ మృతి చెందాడు. ఐదేళ్ల క్రితం పెద్దకొడుకు, ఇప్పుడు చిన్న కొడుకు, మనమరాలు మృతిచెందడంతో వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. ఇదే ప్రమాదంలో హంసిని మృతిచెందడంతో శివ భార్య పద్మ ఒంటరిగా మిగిలిపోయింది.

కుల గణనకు మొరాయించిన సర్వర్

వేపగుంట, జనవరి 19 : కుల గణనకు ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. వేపగుంట జోనల్ కార్యాలయం పరిధిలో సర్వే ప్రారంభమైనప్పటికీ సర్వర్ ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం నుంచి సచివాలయం సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సర్వర్ మొరాయించి మధ్యాహ్నం వరకు ఎర్రర్ చూపింది. సర్వేలో భాగంగా అనేక ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారని సచివాలయం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలి రోజు సర్వర్ ఇబ్బందులు ఎదురయ్యాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు పేర్కొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎన్.ఎ.డీ జంక్షన్ జనవరి 19: అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనాథ వృద్ధుడు ఇటీవల మృతిచెందాడు. కొద్దిరోజులు చూసిన ఆస్పత్రి సిబ్బంది, కుటుంబసభ్యులు ఎవరూ రాకపోవడంతో చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మమతకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె సొంత ఖర్చుతో శుక్రవారం జ్ఞానాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు ఎన్‌జేసీఎస్ సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 19 : స్టీల్‌ప్లాంట్ వేతన సవరణ అంశంపై ఉక్కు ఉద్యోగుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో శనివారం జరగనున్న ఎన్‌జేసీఎస్‌లో వేతన సవరణ అమలుచేస్తారని ఆశిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉక్కు ఉద్యోగులకు వేతన సవరణ అంశంపై 2021 అక్టోబరు 22న జరిగిన ఎన్‌జేసీఎస్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీనిప్రకారం సెయిల్‌లో నూతన వేతనాల అమలు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో అమలు చేయలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

విజేతలకు సత్కారం

కూర్మన్నపాలెం, జనవరి 19 : జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలకు వివిధ పోటీలను నిర్వహించారు. విజేతలను ఘనంగా సత్కరించారు. కారుమూరి మహేశ్, ములుకూరి వెంకటరమణ, మధుసూదనశెట్టి, లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 19: జీవీఎంసీ 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్ వద్ద శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన నమ్మి అప్పలరాజు ఇంట్లోనుంచి శనివారం మంటలు వ్యాపించాయి. పెదగంట్యాడ ఫైర్‌స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి, జనవరి 19: పెందుర్తి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య కేంద్రం, బీఆర్టీఎస్ రోడ్, పెందుర్తి జంక్షన్, అనకాపల్లి, కొత్తవలస రోడ్డు, నటరాజ్ థియేటర్, ఆదిత్యనగర్, రాతిచెరువు, వెలంపేట, చిన్నమిల్లు ఏరియా, బృందావన్ కాలనీ, శేఖర్ లేఅవుట్, అఖిలేశ్వరి ఆస్పత్రి ఏరియా, దొగ్గవానిపాలెం, ప్రసాద్‌నగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా ఈఈ కోరారు.

సింహగిరిపై కొనసాగిన 'స్వచ్ఛ తీర్థ సేవ'

సింహాచలం, జనవరి 19 : సింహగిరిపై శుక్రవారం కూడా స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన రాజగోపురానికి ఎదురుగా ఉన్న కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయ పరిసరాలను శుభ్ర పరిచారు. అలాగే భక్తులు ఆలయ పరిసరాల్లో పెట్టిన పసుపు కుంకుమలు, దీపారాధనల నూనె జిడ్డులను తొలగించారు. కార్యక్రమంలో ఏఈఓలు నరసింగరావు, భ్రమరాంబ, పర్యవేక్షణాధికారులు శిరిపురపు కనకరాజు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 34, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 42, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, క్యాప్రెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



ఆటోనగర్‌లోని డంపింగ్ యార్డులో పొగ





మంటలను ఆర్పుతున్న దృశ్యం

వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

ఆటోనగర్ వద్ద చెత్తకుప్పలకు మంటలు

ఆర్పుతున్న అగ్నిమాపక శకటాలు

ఆటోనగర్, జనవరి 19 : స్థానిక అన్న క్యాంటీన్ సమీపంలోని చెత్త డంపింగ్ యార్డులో గురువారం ఆకతాయిలు నిప్పంటించడంతో పరిసర కాలనీలవాసులు దట్టమైన పొగతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పర్యావరణానికి హాని కలిగించే పొగతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మంటలు ఎక్కువ కావడంతో స్థానికులు ఐలా కమిషనర్ జయచంద్రకు ఫిర్యాదు చేశారు. ఆయన సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది శకటాలతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోనికి తెచ్చారు. ఆటోనగర్ పరిశ్రమలలో వ్యర్థాలు, చెత్తలను అన్నక్యాంటీన్ పరిసరాలలో ఉన్న కొండ ఆవరణలో నిల్వ చేస్తున్నారు. వాటిని కాపులుప్పాడ చెత్త కేంద్రానికి తరలింపులో జాప్యం చోటుచేసుకుంది. ఆకతాయిలు నిప్పు అంటించడంతో సమస్య ఎదురయింది. అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని కోరుతున్నారు.

చెత్త తగుల బెడితే కఠిన చర్యలు

ఆటోనగర్‌లో చెత్తకుప్పలను ఎవరు తగులపెట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఆకతాయిలు చేసిన పనులకు కర్మాగార యజమానులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మంటలను ఆర్పేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలి.

- కె.జయచంద్ర, ఐలా కమిషనర్

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం : పల్లా

గాజువాక, జనవరి 19 : పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమం దిశగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో 74వ వార్డు దయాల్‌నగర్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో గీతం ఆస్పత్రి ముందుకు వచ్చి ప్రతి చోటా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి వియ్యపు కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు జాజుల గంగరాజు, నమ్మి సింహాద్రి, దువ్వి శ్రీను, కోనేటి శ్రీనివాసరెడ్డి, మొల్లి చిన్నోడు, నక్కా సింహాచలం పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

బీసీలకు పెద్దపీట వేసిన ఘనత టీడీపీదే

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ఆర్పీ పేట,(కంచరపాలెం), జనవరి 19: రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు టీడీపీ హయాంలోనేనని సముచిత స్థానం దక్కిందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. గ్రేటర్ 56,57, 58 వార్డులకు సంబంధించి జయహో బీసీ కార్యక్రమాన్ని శుక్రవారం 57వ వార్డు పరిధి సుభాష్‌నగర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గణబాబు మాట్లాడారు. చంద్రబాబు బీసీలకు ఉన్నత స్థానాన్ని కల్పించగా, వైసీపీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేవలం ఓటు బ్యాంకుగానే జగన్ చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో బీసీలంతా సమష్టిగా టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయంలో ముఖ్యపాత్ర వహించాలని కోరారు. బీసీ జనగణన, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం గతంలో తాము తీర్మానం చేశామన్నారు. బీసీలకు న్యాయం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో శరగడం రాజశేఖర్, పెంటకోట అజయ్‌బాబు, మూడు వార్డుల నాయకులు, పాల్గొన్నారు.



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

షీలానగర్ వంతెనపై విద్యుత్ కాంతులు



విద్యుత్ దీపాలతో వెలుగులీనుతున్న వంతెన

మల్కాపురం, జనవరి 19 : కాన్వెంట్ జంక్షన్ నుంచి డాక్‌యార్డు, షీలానగర్‌కు వెళ్లే వంతనపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ మార్గం చీకటిగా ఉండేది. ప్రస్తుతం విద్యుత్ దీపాల ఏర్పాటుతో వారధి పొడవునా కంతులు ప్రసరిస్తున్నాయి. ఈ వంతెనపై ప్రయాణం కొత్తగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు.

రామాలయం ప్రారంభోత్సవం గర్వించదగిన అంశం

గాజువాక, జనవరి 19: అయోధ్యలో రాముని ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించడం భారతీయులంతా గర్వించదగిన అంశమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం అయోధ్య రాముని క్యాలెండర్లను ఆవిష్కరించారు. గొలగాని నాయుడు, రామచంద్రరావు, నాగేశ్వరరావు, యల్లాజీరావు, సోంబాబు, వెంకటరావు, సంజీవరావు పాల్గొన్నారు.

రాజ్యాంగేతర శక్తిగా వైఎస్ భారతి

» అంగన్‌వాడీల దీక్షల్లో సిటూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సిటూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి

పెందుర్తి, జనవరి 19: సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతి రాజ్యాంగేతర శక్తిగా అవతరించారని, ప్రభుత్వ పాలనంతా ఆమె కనుసన్నల్లోనే సాగుతోందని సిటూ జిల్లా ఉపాధ్యక్షుడు పెతకంశెట్టి వెంకటరెడ్డి ఆరోపించారు. ఎన్టీఆర్‌కు లక్ష్మీపార్వతి వెన్నుపోటు పొడిచినట్టు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, భారతి జగన్‌కు వెన్నుపోటు పొడుస్తారన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో భాగంగా మండల పరిషత్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అంగన్‌వాడీలు చేపట్టనున్న 24 గంటల నిరాహార దీక్షలను ప్రారంభించారు. దీక్షలో కూర్చున్న వారికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మెకు దిగి 39 రోజులైనా వైసీపీ సర్కార్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భగా ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది సీఎం డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. అనిత, జిల్లా అధ్యక్షురాలు బృంద, దేవి, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగివేమన జయంతి

పెదగంట్యాడ, జనవరి 19: యోగి వేమన జయంత్యుత్సవాలు శుక్రవారం పెదగంట్యాడ టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వేమన చిత్రపటానికి పూలమాల వేశారు. సరళమైన భాషలో వేమన రాసిన శతకాలు విశేష ప్రజాదరణ పొందాయన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు పిట్ట కుంచారావు, నీలాపు పరదేశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేమనకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం వేమన మందిరంలో శుక్రవారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లి పెంటయ్యరెడ్డి, దూడ పాపారావు, వేణుగోపాలరెడ్డి, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో రహదారికి మరమ్మతులు



గుంతల పూడ్చి వేత పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ఎస్ఐ రమేశ్

పెందుర్తిరూరల్, జనవరి 19: పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ జి.రమేశ్ చొరవతో వేపగుంట, పినగాడి ప్రధాన రహదారిలో గుంతలకు మరమ్మతులు చేపట్టారు. సుమారు ఆరు కిలోమీటర్ల పొడవుగల రహదారి ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పూర్తిగా ఛిద్రమయింది. గోతులతో నిండిపోయింది. వేపగుంట నుంచి పినగాడి మీదుగా సబ్బవరం చేరేందుకు దగ్గర దారి కావడంతో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏడాది క్రితం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చొరవతో రహదారి పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టరు హడావుడిగా పనులు చేపట్టారు. పినగాడి, రాంపురం, పెదగాడి శీలకట్టు ప్రాంతాలలో మూడు చోట్ల సిమెంట్ పైపులతో కల్వర్టులు నిర్మించి, పనులు నిలిపివేశారు. ఆ తరువాత మళ్లీ కనిపించలేదు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్ రోడ్డు పరిస్థితిని దాతలు, వ్యాపారవేత్తలకు వివరించి వారి సహకారంతో శుక్రవారం నుంచి పనులు చేపట్టారు. ఎస్ఐ చొరవను పలువురు అభినందించారు.

'సీఎం స్వార్థ రాజకీయాలకు కోడి కత్తి శ్రీను బలి'

గాజువాక, జనవరి 19 : ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయాలకు కోడికత్తి కేసులో శ్రీను బలయ్యారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శ్రీనుకు బెయిల్ మంజూరుచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీసీ రోడ్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. దళితులపై ముఖ్యమంత్రి మొసలి కన్నీరు కారుస్తున్నారని, వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి మూడు వేల మంది దళితులు బలయ్యారన్నారు. డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇలా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు, పులి వెంకటరమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

అగనంపూడి, జనవరి 19: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీసాయి సేవా సమితి వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు సమకూర్చింది. శుక్రవారం ఆలయంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పంపిణీ చేశారు. సమితి సేవలను కొనియాడారు. సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, రామారావు, పీఎల్ఎన్. రాజు, సత్యనారాయణ, గోవిందరావు, నవీన్, సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, పంకజ, పద్మ, మౌని, లీలావతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త

కూర్మన్నపాలెం, జనవరి 19: జీవీఎంసీ 70వ వార్డు కుంచుమాంబ కాలనీ నుంచి ఆటోనగర్ రహదారిలో పది రోజులుగా చెత్త తొలగించకపోవడంతో స్థానికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. దుర్గంధంతోపాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధుల బారిన పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు చెత్తకుప్పలతో నిండిపోతున్నాయి. రహదారులకు ఇరువైపులా వ్యర్థాల మధ్యనుంచి ప్రయాణించేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆటోనగర్ రహదారిలో చెత్తకుప్పలు

ఎకో వైజాగ్‌పై చిత్రలేఖనం పోటీలు రేపు

వెంకోజీపాలెం, జనవరి 19 : నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దే క్రమంలో ఆదివారం ఎకో వైజాగ్ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అండ్ కన్వెక్షన్స్‌లో జరిగే ఈ పోటీలను రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలు ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్‌పై అవగాహన కలిగి ఉన్నప్పుడే పర్యావరణహితమైన నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పోటీల్లో 15 ఏళ్లలోపు వారు జూనియర్ గ్రూప్‌లో, 15 ఏళ్లు పైబడిన వారు సీనియర్ గ్రూప్‌లో పాల్గొనవచ్చని, సీనియర్ గ్రూప్‌లో గెలుపొందిన వారికి రూ. 25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. జూనియర్ గ్రూప్‌లో విజేతలకు రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ.7 వేలు చొప్పున, రెండు గ్రూపుల్లో 50 మందిని ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు శనివారంలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలను జీవీఎంసీ టోల్ ఫ్రీ నెంబరు 180042500009 లేదా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల సెల్ నంబర్లు 9000086861, 8555058575 సంప్రతించాలని ఆయన సూచించారు.

శ్రీరామచంద్రుడికి నవనీత అలంకరణ

పెందుర్తి, జనవరి 19 : చినముషిడివాడ చాణక్యనగర్‌లోని శ్రీరామాలయంలో విగ్రహమూర్తులకు శుక్రవారం నవనీత (వెన్న) అలంకరణ నిర్వహించారు. ఈనెల 22న అయోధ్య రామమందిరంలో శ్రీరాముని విగ్రహప్రాణప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించే వరకు స్వామి నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.అంతకుముందు స్వామివారికి అర్చన, హారతి, అభిషేకాలు నిర్వహించారు.



అంగన్‌వాడీల పోరాటానికి సీఐటీయూ మద్దతు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 19 : అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటాలకు స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ప్లాంట్‌లో శనివారం అంగన్‌వాడీలకు మద్దతుగా నిధిని సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి పలు రూపాల్లో విన్నవించినా ఫలితం లేకపోయిందని, ఈస్థితిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.రామస్వామి, వైటి.దాసు, బి.అప్పారావు, శ్రీనివాసరాజు, వెంకటేశ్వర్లు, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

'ఉక్కు పరిరక్షణకు సమష్టి కృషి'

కూర్మన్నపాలెం, జనవరి 19 : ఉక్కు పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని, ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు ఒకే తాటిపైకి రావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో 1072 రోజుల రిలే దీక్షల శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని ఆరోపించారు. మరో నేత వరసాల శ్రీనివాసరావు ఉక్కుకు సొంత గనులు కేటాయించాలన్నారు. బ్యాంకుల విలీనం తరహాలోనే సెయిల్, ఎన్ఎండీసితో స్టీలు ప్లాంట్‌ను కలపాలన్నారు. ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడానికి వీలులేదన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో నడపాలని డిమాండ్ చేశారు. జె.అయోధ్యరామ్, ఉక్కు కార్మికులు పాల్గొన్నారు.

తిరుమల నగర్‌వాసికి అవార్డు



అవార్డు సాధించిన మూర్తిని అభినందిస్తున్న తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం, జనవరి 19: తిరుమల నగర్ కాలనీకి చెందిన మాజీ సైనికుడు పీవీవీఎస్ మూర్తికి వెటరన్ సేవా అవార్డు లభించింది. కేంద్ర వెటరన్స్ సెల్ (త్రిదళసేన- ఆర్మీ, నేవీ, వాయుసేన)లో మాజీ సైనికుల స్వచ్ఛంద సంఘ సేవలకు అవార్డును అందజేశారు. నగర కార్యాలయంలో అధికారులు కల్నల్ శంకర్, కమోడర్ సుబ్బారావు, జిల్లా సైనికాధికారి డాక్టర్ సత్యానందం శుక్రవారం పురస్కారాన్ని అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు తదితర కాలనీ వాసులు మూర్తిని అభినందించారు.

రాజ్యాంగ నిర్మాతకు అవమానం: టీడీపీ

పెదగంట్యాడ, జనవరి 19 : విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించడం అంబేడ్కర్‌ను అవమానించడమే నని టీడీపీ దళిత నాయకులు విమర్శించారు. ఈ మేరకు పెదగంట్యాడ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ ఆలోచనలకు విరుద్ధంగా వ్యవహరించే జగన్ ఆయన విగ్రహావిష్కరణకు అనర్హుడన్నారు. కార్యక్రమంలో ములకలపల్లి పెంటయ్య, పెదపూడి అప్పలస్వామి, టేకేటి అప్పారావు, గంట్యాడ కనకరాజు, పార్టీ నేతలు పులి వెంకటరమణారెడ్డి, దొమ్మేటి పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఘనంగా సీతారామాలయ తీర్థ మహోత్సవం



కొండయ్యవలస రామాలయం వద్ద కోలాటమాడుతున్న చిన్నారులు

గోపాలపట్నం, జనవరి 19: స్థానిక యల్లపువానిపాలెంలోని సీతారాముల ఆలయ తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సీతారాముల విగ్రహాలను సుందరంగా అలంకరించారు. ఆలయకమిటీ, ఆధ్వర్యంలో సాయింత్రం పరస ఉత్సవం జరిగింది.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస రామాలయం వద్ద శుక్రవారం సీతారాముల పరస మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు పూజలు చేశారు. సాయంత్రం కమిటీ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెట గుళ్లు, సాముగరిడీలు, బొమ్మలకొలువు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో విందుల వెంకటరమణ, బలిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి అప్పారావు, సాయిన సన్యాసిరావు, విందుల వరహాలు, పిళ్లా కొండలరావు, బలిరెడ్డి సత్యనారాయణ, రామచంద్రరావు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జనవరి 19: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా రజిత వేదికపై అధిష్ఠింపజేశారు.ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో అర్చకుడు పద్మహాస చక్రవర్తి సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళార్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి నిత్య కల్యాణం జరిపారు.

మూడేళ్లు ఒకే చోట పనిచేసిన అధికారులకు బదిలీ

▸ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా

మహారాణిపేట, జనవరి 19: రాష్ట్రంలో లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాల్గొనే అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసిన అధికారులను మరో జిల్లాకు బదిలీ చేయాలని సూచించారు. శుక్రవారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌నుంచి జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్‌తో సహా పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు అవసరమైన పరిశీలకులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది నియామకంపై చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

22న ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మురళీనగర్, జనవరి 19 ; అయోధ్య శ్రీరామ మందిరంలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్ రామాలయంలో 22వతేదీ సోమవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధ్యక్షులు టి.ఎన్.రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రామ రక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా ఆరాధన కార్యక్రమాలను లలిత భక్త మండలి అధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. 11 గంటలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సత్సంగ్ బృంద సభ్యులు మధ్యాహ్నం 1గంట వరకు శ్రీరామ నామ భజన కార్యక్రమం చేపడతారని అన్నారు. సాయంత్రం మందిరందీపాలంకరణ చేసి సీతారాములకు ప్రత్యేక దర్శనాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కులగణన సర్వే ప్రారంభం


చిన్నూరులో ఫేషియల్ తీస్తున్న సెక్రటరీలు

అక్కయ్యపాలెం, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ప్రక్రియలో భాగంగా అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, దొండపర్తి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సర్వే ప్రారంభమైంది. ఈ నెల 29వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుంది. ఈ మేరకు సచివాలయాల సెక్రటరీలు ఇంటింటికి వెళ్లి బయోమెట్రిక్, ఫేషియల్, ఐరీస్ ద్వారా సర్వే కులగణన సర్వే చేపట్టారు. అయితే, సర్వర్ మొరాయించడంతో సర్వే అంతంతమాత్రంగానే సాగింది. గ్రేటర్ 26వ వార్డులో 19 క్లస్టర్స్ ఉన్నాయి. ఎనిమిది మంది సెక్రటరీల ఆధ్వర్యంలో ఈ కులగణన సర్వే జరిగింది. గ్రేటర్ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెం సచివాలయం పరిధిలో 17 క్లస్టర్స్ లో ఎనిమిది మంది సెక్రటరీలు కులగణన సర్వే చేస్తున్నారు. మిగతా వార్డుల్లోనూ సర్వర్ మొరాయించడంతో సర్వే ఆలస్యంగా అవుతోంది.

అలరించిన 'గుర్తుకొస్తున్నాయి'


బృంద గానంలో ఆలపిస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, జనవరి 19: మెలోడీ క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి , కళాంజలి సరిగమప సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గుర్తుకొస్తున్నాయి సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కే.శిరీష, వంకాయల సన్యాసిరాజు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం సీహెచ్‌వీ సత్యనారాయణ, కడలి , ఎంవీ రాజశేఖర్, వి.ప్రభాకర్ , వీవీ చారి, సురేష్ కన్నా, సత్యవతి, జ్యోతి, సత్యశ్రీ, లక్ష్మీ సాత్విక, నిషత తెలుగు చలన చిత్రాల గీతాలను ఆలపించారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ మాధవ్, పుండరీ కుమార్, ఫణిస్వామి, కొణతాల రాజు, ఎస్.విజయ్‌కుమార్, సన్‌మూర్తి, మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు చేరాలి; జెడ్సీకృష్ణ


మాట్లాడుతున్న జెడ్సీ ఆర్జీవీ కృష్ణ

మాధవధార, జనవరి 19; ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సిబ్బంది, అధికారులు దృష్టి సారించాలని జోన్-5 జెడ్సీ ఆర్జీవీ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మాధవధారలోని జీవీఎంసీ మాధవస్వామి కల్యాణమండపంలో యూసీడీ విభాగం ద్వారా అమలవుతున్న వివిధ పథకాలపై సిబ్బందికి అవగాహన సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హాజరైన జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు, జోన్-5 ఏపీడీ పద్మావతి ఆర్పీలు, సచివాలయ సిబ్బందికి పథకాలపై అవగాహన కల్పించారు. పలువురు సిబ్బంది అడిగిన సందేహాలను ఈ సందర్భంగా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు చిరంజీవి, నాగరాజు తదితరులు ఉన్నారు.

మైదానం నిర్వహణపై అధికారం ఇచ్చారు..

రైల్వే న్యూ కాలనీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

అక్కయ్యపాలెం, జనవరి 19: రైల్వే న్యూకాలనీలోని కేఎస్ఎం పాఠశాల మైదానం నిర్వహణకు 2014లో అప్పటి జీవీఎంసీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ తమకు అధికారం ఇచ్చినట్టు రైల్వేన్యూకాలనీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్ చలం, ఎం.సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ అధికారులనుంచి మౌఖిక ఆదేశాలు తీసుకున్న తర్వాత రైల్వే న్యూకాలనీ వాకర్స్ వెల్ఫేర్ కమిటీ సొంత సహకారంతో మైదానాన్ని నిర్వహణను చేపడుతున్నట్టు వివరించారు. అప్పటినుంచి మైదానం శుభ్రత, నిర్వహణ కోసం ముగ్గురిని నెలవారీ వేతనాలపై విధుల్లో చేర్పించినట్టు చెప్పారు. కాలనీలోని స్థానికులు స్వచ్ఛందంగానే మైదానం నిర్వహణకు నెలకురూ.100 ఇస్తున్నారని, ఎవరినీ బలవంతం చేయడం లేదన్నారు. మొక్కలకు నీరు, ఫెన్సింగ్, బుద్ధుని విగ్రహం ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్ట్, వాలీబాల్ కోర్ట్, మూడు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు తదితర పనులను స్థానికుల విరాళాలు, సహకారంతో చేపడుతున్నట్టు వారు వివరించారు.

ప్రజాకవి వేమన


ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

జ్ఞానాపురం, జనవరి 19: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం ప్రజాకవి వేమన జ యంతిని వేమన ఫౌండేషన్ సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి, ప్రిన్సిపాల్ డా సిస్టర్ షైజీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ , పామరులకు కూడా అర్థమయ్యే సరళ వాడుక భాషలో తన పద్యాలను రాసిన వేమన చిరస్మరణీయులన్నారు. వందల ఏళ్లయిన ప్రజల్లో ఆయన కవిత్వం నిలిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలోడా.వీకే జయలక్ష్మి, డా.జె.నిర్మల,డా. కె.గౌరి నాయుడు, డాక్టర్ దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, సిస్టర్ జైన్ పాల్గొన్నారు.


రెల్లివీధిలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట గండి బాబ్జీ ఆధ్వర్యంలో నిరసన


తాటిచెట్లపాలెంలో నిరసన చేపడుతున్న టీడీపీ నాయకులు

జగన్ దళిత ద్రోహిగా మిగిలిపోతారు

▸ 'దక్షిణ' ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దళిత ద్రోహిగా మిగిలిపోనున్నారని, టీడీపీ దక్షిణ నియోజక వర్గ ఇన్ చార్జి గండి బాబ్జీ అన్నారు. కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనుకు న్యాయం జరగాలని కోరుతూ శుక్ర వారం రెల్లివీధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్య మంత్రి జగన్ దళితులకు అన్యా యం చేసి... మరోవైపుఅంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరించి ఆ పాపాలు కడుక్కోవాలనుకుంటున్నారన్నారు. కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనును ఐదేళ్ల జైల్లో పెట్టారని, ఒకవేళ ఈ కేసులో శిక్ష విధించినా ఇన్నేళ్ల కంటే తక్కువే శిక్ష పడేదని అన్నారు. దళితుడు సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన అనం తబాబును జగన్ పక్కన పెట్టుకున్నారన్నారు.మాస్కు అడిగిన డాక్టర్ సుధాకర్‌ను మానసి కంగా హింసించి చంపారన్నారు. బాబాయి వివేకానందరెడ్డిని చంపిన నిందితులను కాపాడుతున్నారని బాబ్జీ ఆరోపించారు.ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ తన కళాశాలలో మద్యం పంపిణీ చేయడంపై కలెక్టర్ కూడా ఫిర్యాదు చేసి నట్టు చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుదేశం అధికారంతో ప్రజల జీవితాల్లో మార్పు

పూర్ణామార్కెట్: రాష్ట్రంలో తెలుగుదేశం గెలుపుతోనే ప్రజల జీవితాల్లో మార్పుసాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం 36వ వార్డులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి తేవాల్సినఅవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కె.గణపతి, క్లస్టర్ ఇన్ చార్జి కేధారి లక్ష్మి, బూత్ అధ్యక్షుడు భద్రరావు, పార్టీ సీనియర్లు శ్రీనివాస్ రామిరెడ్డి, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనతో దళితులపై దమనకాండ

అక్కయ్యపాలెం: వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై దమనకాండ సాగుతోందని ఉత్తర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విజయ్‌బాబు అన్నారు. జైల్లో ఉన్న కోడికత్తి శ్రీనుకు మద్దతుగా తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుక్కళ్ల పైడికొండ, పామోటి బాబ్జి, కొయిలాడ వెంకటేష్, ఆకిరెడ్డి జగదీష్, వాసుపల్లి రాజు, యాగాటి ఆదిలక్ష్మి, బొడ్డేటి మోహన్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం

▸ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అభ్యక్షుడు భీశెట్టి బాబ్జీ


మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

సీతంపేట, జనవరి 19: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఉత్తరాంధ్రకి తీరని అన్యాయం జరిగిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు. నలుగురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తూన్నా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.ఉత్తరాంధ్రకు అభివృద్ధి చేస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి జగన్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. ఇప్పుడు ఈ నెల 25వ తేదీ నుంచి సీఎం జగన్‌ప్రచార యాత్ర ఉత్తరాంధ్రనుంచి ప్రారంభిస్తారని చెబుతున్నారన్నారు. ఉత్తరాం ధ్రలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయలేకపోయారన్నారు. మూతపడిన ఏటికొప్పాక, తండావ, అనకాపల్లిన భీమసింగి సహకార చక్కెర ఫ్యాక్టరీలుతెరిపించలేకపోయారన్నారు. ఎంతో ప్రాముఖ్యమైన అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో లక్ష దిమ్మలు వచ్చేవని, ఈ రోజు వెయ్యికి పడిపోతే.. ప్రభుత్వం ఏమీ చేసిందన్నారు. కేజీహెచ్‌లో ఆధునిక పరికరాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. కొత్త పరిశ్రమలు రాక నిరుద్యోగులకు ఉపాధి కరువైందన్నారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, మెట్రో రైల్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీలు ఏమయ్యాయని బాబ్జీ నిలదీశారు. ఇవేమీ చేయకుండా ఎన్నికలకు సిద్ధం కావడం సిగ్గుచేటలన్నారు.ఈ స్థితిలో ఆ పార్టీనేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.పార్టీ నేతలు ఎంఎస్ఎన్ మూర్తి, రామకృష్ణపాల్గొన్నారు.

కుంచుమాంబ ఉత్సవాలు ప్రారంభం


కుంచుమాంబకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

పూర్ణామార్కెట్, జనవరి 19: జీవీఎంసీ 30వ వార్డు రెల్లి వీధిలోని కుంచుమాంబ అమ్మవారి పరస మహోత్సవాన్ని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరంఅమ్మవారికి పూజలు జరిపారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ కా ర్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు నిమ్మకాయల శి వాజీ మాణిక్యాలరావు, చిన్ని పాల్గొన్నారు.

పోలమాంబ ఉత్సవాలకు పందిరిరాట

జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధి ప్రాంతవాసుల ఆరాధ్యదైవం పోలమాంబ ఉత్సవాలకు సంబంధించి శుక్రవారం పందిరాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చరణ, వాయిద్యమేళాల మధ్య రాట వద్ద ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం గుడి వద్ద మహిళలు రాటను నిలిపారు. రాటకు పూజలు నిర్వహించారు. ఈనెల 22నుంచి 24 వతేదీ వరకు ఈ ఉత్సవాలు సాగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా టోల్ వసూలు

▸ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సీతంపేట, జనవరి 19: టోల్‌గేట్ పేరుతో మాఫియా నగరవాసులను దోపిడీ చేస్తోందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో నుంచి వెళ్లే రహదారికి ప్రత్యామ్నాయంగా అనకాపల్లి- ఆనందపురం రహదారి నిర్మించారని, దానిని జాతీయ రహదారిగా గుర్తించి, రెండు టోల్‌గేట్లను ఏర్పాటు చేసి వసూళ్లు ప్రారంభించారన్నారు. నగరంలోని రోడ్డుకు హైవే హోదాను తీసివేస్తూ గెజిట్ కూడా జారీ చేశారన్నారు. అయినా అగనంపూడి వద్ద టోల్ వసూలు ఆగడం లేదన్నారు. అగనంపూడి టోల్ గడువు ఎప్పుడో ముగిసిపోయిందని, రహదారి నిర్వహణ బాధ్యతను జీవీఎంసీ తీసుకున్నా దోపిడీ కొనసాగుతోందన్నారు. మాఫియాతో చేతులు కలిపిన అధికార పార్టీ నేతలు దోచుకుంటున్నారన్నారు. దేశంలో అతి తక్కువ టోల్‌గేట్లు తమిళనాడు, గుజరాత్‌లో ఉండగా, ఎక్కువ గేట్లు ఏపీలో ఉన్నాయన్నారు. అగనంపూడి టోల్‌గేట్ కొనసాగడంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మంత్రి అమర్‌నాథ్, గాజువాక ఎమెల్యే తిప్పల నాగిరెడ్డి బాధ్యులన్నారు. విశాఖను దత్తత తీసుకున్నానని ప్రకటించుకుంటున్న ఓ బీజేపీ ఎంపీ, కేంద్రంలో చక్రం తిప్పిన నేతలు కూడా దీనిని పట్టించుకోవడం లేదన్నారు. అగనంపూడి టోల్ గేట్‌ను వెంటనే తొలగించకుంటే కేంద్ర ప్రభుత్వంతో పాటు న్యాయ స్థానాన్ని ఆశ్రయించి నగర వాసులకు ఉపశమనం కల్పిస్తామన్నారు. సమావేశంలో దల్లి గోవింద్‌రెడ్డి, నాగలక్ష్మి చౌదరి, త్రివేణి, వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్'

అల్లిపురం, జనవరి 19: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నియోజకవర్గంలో వారంలో రెండు రోజులపాటు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం 34వ వార్డులోని మనోరమ థియేటర్ వద్ద 32,33,34వ వార్డుల్లోని ప్రజలకు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 20 వినతులు

మహారాణిపేట, జనవరి 19: పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 20 వినతులు వచ్చాయి. సీపీ ఏ రవిశంకర్ ఈ వినతులు స్వీకరించారు.అనంతరం పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

22 తేదీన సెలవు ప్రకటించాలి

▸ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జనవరి 19: అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు నేపథ్యంలో 22న అన్ని రాష్ట్రాల్లోల్లానే ఆంధ్రప్రదేశ్ లోనూ సెలవు ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు కోరారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆంధ్రప్రదేశ్‌లో హిందువుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌పై ఉందన్నారు. 500 వందల ఏళ్ల పోరాట ఫలితంగా నిర్మించిన రామమందిరం ప్రారంభోత్సవానికి సెలవు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. దీనిని వీ క్షించడానికి రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు.

దొంగ ఓట్లపై ఫిర్యాదు

రాష్ట్ర వ్యాప్తంగా దొంగ ఓట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కి వినతిపత్రం సమర్పించినట్టు విష్ణుకుమార్ రాజు తెలిపారు. తిరుపతిలో ఏ విధంగా 30 వేల దొంగ ఓట్లు బహిర్గతమయ్యాయో అలాగే, 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దొంగ ఓట్లు ఉన్నట్లు గమనించి కమిషన్‌కి పత్రాలను ఇచ్చామన్నారు. 2024 సాధారణ ఎన్నికలలో 110 స్థానాల్లో తిరుపతి తరహా కుట్రకు జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు 17 సీట్లు కూడా రావన్నారు. జగన్ రాష్ట్రంలో ప్రజల నుంచి దోచుకున్న సొత్తుతో ఎన్నికలకు పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. నాయకులు పరశురామ్‌రాజు, సురేష్‌బాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో ఆలయ ప్రారంభం ఆహ్వానించదగినదే..


▸ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి

డాబాగార్డెన్స్, జనవరి 19: ప్రపంచంలో ఉండే హిందువులంతా ఆదర్శ పురుషుడిగా కొలిచే శ్రీరాముడి ఆలయం అయోధ్యలో ప్రారంభం కోసం పార్టీలకు అతీతంగా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి అన్నారు. అయితే, శాస్త్రోక్తంగా పీఠాధిపతుల సమక్షంలో ప్రారంభించాల్సి ఉన్నా, ప్రస్తుతం ఇంకా నిర్మాణంలోనే ఉండగా ఎన్నికల ముందు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా ప్రాణ ప్రతిష్ఠకు ఉత్సాహం చుపుతుండడాన్ని ప్రతిపక్షాలతోపాటు పీఠాధిపతులు తప్పుపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. కొద్ది నెలల్లోనే ఆలయం పనులు పూర్తి చేసి ప్రారంభిస్తే.. ఎటువంటి అభ్యంతరం ఉండేదని కాదని తెలిపారు. ఈ ఆలయాన్ని ప్రధాని మోదీ ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించాలని చూడడం ఎన్నికల కోసమేనని ఎవరికైనా అర్థమవుతుందని ఆమె ఆరోపించారు.

వ్యాపారిపై వ్యక్తి దాడి

సీతంపేట, జనవరి 19: నాలుగో పట్టణ పోలీసు స్టేష్ పరిధి తాటిచెట్లపాలెం సూయిజ్ ఫాం వద్ద సమోసా బండి వద్ద ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. సమాచారంమేరకుసీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. సూయిజ్ ఫాం సమీపంలో సాకల జగదీష్ భార్య విమలతో కలిసి సమోసా, జిలేబీల వ్యాపారం చేస్తున్నారు. అక్కడికి సమీపంలో ఉంటున్న షేక్ ఖాజామోహిదిన్‌వచ్చి సమోసాలు కావాలని అడిగాడు. రెండు సమోసాలిచ్చి ఇచ్చి డబ్బులు జగదీష్ అడిగాడు. దీంతో తాను డబ్బులు ఇవ్వనట్టు కనిపిస్తున్నానా అంటూ... బండి అద్దం చేతితో మోహిదీన్ విరగొట్టాడు. విమలపైనా దాడిచేశాడు.ఈ క్రమంలోమోహిదీన్ గాయమైంది. వెంటనే ఎస్ఐ వెంకటరావు మోహిదీన్‌ను అదుపులో తీసుకొని పోలీసు స్టేషన్‌కి తీసుకువచ్చారు. సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

సౌత్‌జోన్ వుమెన్ వన్డే క్రికెట్ జట్టుకు ముగ్గురు ఎంపిక


ఎంపికైన స్నేహ దీప్తి, క్రికెట్ దుర్గ, క్రికెట్ షబ్నమ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 19: సౌత్‌జోన్ సీనియర్ మహిళల వన్డే క్రికెట్ జట్టుకు స్నేహ దీప్తి, ఎం.దుర్గ, ఎండీ.షబ్నమ్ ఎంపికైనట్టు ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి గోపీనాధరెడ్డి తెలిపారు. అలాగే, సౌత్ జోన్ జట్టుకు విశాఖకు చెందిన స్నేహ దీప్తి వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సౌత్‌జట్టుకు ఎంపికైన క్రికెటర్లను ఏసీఏ అధ్యక్షుడు పి.శరత్ చంద్రారెడ్డి అభినందించారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి : యూటీఎఫ్



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

సిరిపురం, జనవరి 19 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ. 18.96 కోట్లను తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూటీఎఫ్ నాయకులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బకాయిల చెల్లింపునకు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకూ చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే ఈనెల 24న జిల్లాస్థాయిలోనూ, 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రంలో దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు టి. అప్పారావు, పైడిరాజు, రొంగలి ఉమాదేవి, కె. రాంబాబు, సత్యం, రియాజ్ అహ్మద్, జగన్, రాంబాబు, రాజు, ప్రసాద్, సత్యనారాయణ, శోభా, హాక్, రామేశ్వరి పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు.. దారి మళ్లింపు

విశాఖపట్నం, జనవరి 19: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడిపిస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే.త్రిపాఠి తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవీ..

ఈనెల 19వతేదీ నుంచి ఫిబ్రవరి 25 వరకు గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 26 వరకు విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240) రద్దు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకు మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), కాకినాడ-విశాఖ పాసింజర్ రైలు (17267) రద్దు చేశారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 26వరకు విశాఖ-మచిలీపట్నం(17220), విశాఖ-కాకినాడ పాసింజర్ (17268) రద్దు.విశాఖ-విజయవాడ/ గుంటూరు-విశాఖ మధ్య నడిచే 22701, 22702 నంబర్లు గల ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 19, 20, 22, 23, 24, 26, 27 తేదీల్లో రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

గమ్యం కుదింపు..

గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) ఈనెల 25 వతేదీనుంచి ఫిబ్రవరి 25 వరకు గుంటూరు నుంచి విజయనగరం వరకు, అలాగే, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 26 వరకు విజయనగరం నుంచి గుంటూరుకు నడుస్తుంది. రాయగడ, విజయనగరం మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేశారు.ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 25 వరకు ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351); ఈనెల 29, ఫిబ్రవరి 5, 12, 19న హటియా-ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837); ఈనెల 30, ఫిబ్రవరి 4, 6, 11, 13, 18, 20, 25, హటియా-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (12835); ఈనెల 31, ఫిబ్రవరి 7, 14, 21న జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్(12376);ఫిబ్రవరి 1, 8, 15, 22న టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111); ఫిబ్రవరి 2, 9, 16, 23న టాటానగర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయని సీనియర్ డీసీఎం పేర్కొన్నారు. కాగా, ఈనెల 22, 29, ఫిబ్రవరి 5, 12, 19న ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); ఈనెల19, 24, 26, 31, ఫిబ్రవరి 2, 7, 9, 14,16, 21, 23వ తేదీల్లో బెంగళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్ (12509); ఈనెల 19, 29, 31, ఫిబ్రవరి 2, 3, 5, 7, 9, 10, 12, 14, 16, 17, 19, 21, 23, 24న ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లకు ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో హాల్ట్ ఉండదని తెలిపారు.

డీఆర్ఎం తనిఖీలు


రాయగడ లెవెల్ క్రాసింగ్ గేట్ వద్ద పరిశీలిస్తున్న డీఆర్ఎం

విశాఖపట్నం, జనవరి 19: వాల్తేరు డివిజన్ పరిధిలోని సింగపూర్ రోడ్డు, రాయగడ సెక్షన్లలో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ శుక్రవారం భద్రతా తనిఖీలు చేశారు. సింగపూర్ రోడ్డు స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, పురోగతిలో ఉన్న భద్రతా నిర్మాణ పనులతోపాటు యార్డులో ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్ (వోహెచ్‌ఈ), పాయింట్స్, క్రాసింగ్స్ ట్రాక్ సర్క్యూట్‌కు సంబంధించి వాటిని పరిశీలించారు. అలాగే యార్డు లే అవుట్, ట్రాక్స్ రిలే రూమ్, బ్యాటరీ, సిగ్నల్స్ వంటి భద్రతా అంశాలను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి భద్రతకు పాటిస్తున్న పద్ధతులపై ఆరా తీశారు. ఇక రాయగడ వద్ద గల 252 నంబరు గల లద్దా-రాయగడ లెవెల్ క్రాసింగ్ వద్ద చెక్ ఇంటర్ లాక్ గేట్ వర్కింగ్, భద్రతా నియమాల అ మలు విధానాలను పాటించారు. గేట్ వద్ద అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. పర్యటనలో డీఆర్ఎంతోపాటు ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు పంపిణీ

అల్లిపురం, జనవరి 19: దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు ఆటో డ్రైవర్లకు శుక్రవారం తన కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ రాష్ట్రంలో ప్రజలు వైసీపీ పాలనకు విసుగుచెందారని, రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని అన్నారు.

ముగ్గురు ఏఎంసీ వైద్యులకు పదోన్నతులు

... 5వ పేజీ తరువాయి

పదోన్నతి కల్పిస్తూ పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. అలాగే, కేజీహెచ్‌లోని పీడియాట్రిక్స్ విభాగాధిపతిగా పని చేస్తున్న ప్రొఫెసర్ ఎంఎస్ రాజుకు పదోన్నతి కల్పించిన ప్రభుత్వం..మదనపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. అనస్థీషియా విభాగాధిపతిగా పని చేస్తున్న డాక్టర్ ఎ.పద్మజను పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది.

వీఎస్ఎస్‌పై భగ్గుమంటున్న ఉక్కు

... 5వ పేజీ తరువాయి

పనిచేయాలంటే వెంటనే రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేసింది.

వీఎస్ఎస్ పథకాన్ని వెనక్కి తీసుకోండి

డి.ఆదినారాయణ, జనరల్ సెక్రటరీ, గుర్తింపు యూనియన్

ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టాలని చూస్తున్న వీఎస్ఎస్ పథకం చాలా దారుణమైనదని, ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వకుండా ఉద్యోగులను అనారోగ్యం పేరుతో తొలగించడానికి కుట్ర చేస్తున్నారని, దానిని తాము ఆమోదించబోమని గుర్తింపు యూనియన్ జనరల్ సెక్రటరీ డి.ఆదినారాయణ స్పష్టంచేశారు. ఆ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తాడి నెత్తిన మరో కుంపటి

... 5వ పేజీ తరువాయి

ఆనుకుని కొండ సమీపంలో ప్లాంట్ ఏర్పాటుచేశారు.

ఒక అంచనా మేరకు ఫార్మాసిటీలోని కంపెనీల నుంచి ప్రతినెలా పది వేల టన్నుల ఘన వ్యర్థాలు తాడి దగ్గర ప్లాంటుకు వస్తున్నాయిఇ. ఒక్క ఫార్మా సిటీ కాకుండా ఉత్తరకోస్తాలోని శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు కెమికల్, డ్రగ్ కంపెనీల నుంచి వచ్చే ఘన వ్యర్థాలు ఈ ప్లాంటుకు తరలిస్తుంటారు. సుమారు పదేళ్ల నుంచి ఘన వ్యర్థాలను తాడి సమీపంలో ల్యాండ్‌ఫిల్ ప్లాంట్‌కు తరలిస్తుండడంతో ప్రస్తుతం పెద్ద కొండలా తయారైంది. ల్యాండ్ ఫిల్ ప్లాంట్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ఆనుకుని మరికొంత భూమి ఆక్రమించుకుని ఘనవ్యర్థాలు నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ల్యాండ్ ఫిల్ ప్లాంట్లు నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా లేని కారణంగా తాడితోపాటు పరిసర గ్రామాలు కాలుష్యం బారిన పడ్డాయి. తాడి గ్రామం అయితే ఇటు ల్యాండ్ ఫిల్ ప్లాంటు, అటు ఫార్మాసిటీ నుంచి వచ్చే కాలుష్యంతో ఉక్కిరిబిక్కిర వుతుంది. గ్రామం చుట్టూ భూగర్భ జలాలు ఎప్పుడో కలుషితమయ్యాయి. భూగర్భ జలాలు వినియోగించరాదని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన నిపుణులు హెచ్చ రించారు. తాడి గ్రామాన్ని తరలించాలని ఏళ్ల తరబడి గ్రామస్థులు పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి మరోవైపుగా 50 ఎకరాల్లో కొత్తగా ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకోసం ఈనెల 30న కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించ నున్నది. మరో ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తాడి వద్ద ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయవద్దని పరవాడ సీపీఎం నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించకుండా కొత్తగా ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయడం దారుణమన్నారు. తాడి గ్రామాన్ని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీ శంకుస్థాపన సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు కాలేదు సరికదా తిరిగి గ్రామం నెత్తిన మరో కుంపటి పెడుతున్నారని ఆరోపించారు.

అయ్యో...పాపం

... 5వ పేజీ తరువాయి

వివాహమైంది. వారికి ఓ కుమార్తె హంసిని (8) ఉంది. కాగా శివ ఐదేళ్ల క్రితం దొప్పెర్ల వెళుతూ దేశపాత్రునిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి అతడి భార్య పద్మ తన కన్నవారింట ఉంటోంది. రెండో కుమారుడు వెంకటప్రసాద్ ఫార్మా కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. అతడికి తన మామ కుమార్తెతో ఇటీవల వివాహం నిశ్చయమైంది. మరో మూడు నెలల్లో పెళ్లి జరగనుంది. ఈ లోగా తన అన్న కుమార్తెను ఆమె తల్లి దగ్గరకు తీసుకువెళుతుండగా జరిగిన ప్రమాదంలో వెంకటప్రసాద్ మృతిచెందాడు. ఐదేళ్ల క్రితం పెద్దకొడుకు, ఇప్పుడు చిన్న కొడుకు, మనమరాలు మృతిచెందడంతో వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. ఇదే ప్రమాదంలో హంసిని మృతిచెందడంతో శివ భార్య పద్మ ఒంటరిగా మిగిలిపోయింది.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

భీమునిపట్నం (రూరల్), జనవరి 19 : మండలంలోని చిప్పాడ దివీస్ యాజమాన్యం తన పరిధిలో ఉన్న చిప్పాడ, అన్నవరం, నగరపాలెం, గుడివాడ, తూడెం, చెరుకుపల్లి, లింగాలవలస పంచాయతీలకు చెందిన 73 మంది విద్యార్థులకు గురువారం సాయంత్రం ఉపకార వేతనాలు అందించింది. మొత్తం రూ.4.39 లక్షలు 8వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి 2022-23 విద్యా సంవత్సరంలో వచ్చిన మార్కుల ఆధారంగా అందించారు. ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల గాన కచేరి

ఎంవీపీ కాలనీ, జనవరి 19 : అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 13 నుంచి నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార పరిషత్,విశాఖ జిల్లా ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంయుక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. శుక్రవారం శ్రీమన్నారాయణ కోలాట బృందం, నాట్యపరిమళ డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నాట్యనీరాజనం, మైథిలి, పద్మ, ఉమా బృందం హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామ భక్తి గీతాలాపన ప్రదర్శించారు. అలాగే ఎస్వీ భువనేశ్వరి బృందం శ్రీరామ భక్తి గీతాలు, చందన డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నృత్యం ఆకట్టుకున్నాయి.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, జనవరి 19 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి పలు ఆర్జిత సేవలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని మేల్కొలిపి సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా రజిత వేదికపై అధిష్టింపజేశారు.ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో అర్చకుడు పద్మహాస చక్రవర్తి సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళార్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి నిత్య కల్యాణం జరిపారు.

నాగుపాము కలకలం



సింహాచలం, జనవరి 19 : జీవీఎంసీ 98వ వార్డు శిడగం వీధిలో అడివివరం సొసైటీ పాలక మండలి సభ్యుడు ఆకుల నాగరాజు ఇంట్లో గురువారం రాత్రి సుమారు ఆరు అడుగుల నాగుపాము కలకలం రేపింది. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని సింహాచలం దేవస్థానం అలంకారి కరి సీతారామాచార్యులుకు తెలియజేయగా ఆయన వచ్చి పామును బంధించి సమీపంలోని తోటల్లో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 34, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజ్ 18, క్యారేట్ 38, దొండకాయలు 26, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 42, దోస కాయలు 38, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ఇరుకు రోడ్లు... భారీ లోడ్లు

పద్మనాభం(రూరల్), జనవరి 19 : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఇరుకు రోడ్ల మీదుగా గడ్డి ట్రాక్టర్లు భారీ లోడ్లుతో రాకపోకలు సాగిస్తుండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రెడ్డిపల్లి నుంచి కోరాడ, రేవిడి నుంచి అయినాడ, మద్ది నుంచి అలమండ ఆర్‌ఎస్ రహదారుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. గడ్డి ట్రాక్టర్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాస్తవానికి గడ్డిని రాత్రి వేళ మాత్రమే తరలించాల్సి ఉంది. కానీ పట్టపగలు, రద్దీ సమయాల్లోనూ తరలిస్తున్నారు. అలాగే లోడుతో వెళ్తున్న సమయంలో కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉన్నా.. ఏ ఒక్కరూ అవేవీ పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు.



మద్ది జంక్షన్‌లో గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు

పద్మనాభం సీఐగా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ



పద్మనాభం, జనవరి 19 : పద్మనాభం సీఐగా సీహెచ్ శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సిబ్బందిని పరిచయం చేసుకొని సమీక్ష సమావేశం నిర్వహించారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలు, తరచూ నమోదయ్యే కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో తమవంతు పాత్ర పోషిస్తూ, ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి : డీఆర్‌డీఏ పీడీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

పద్మనాభం, జనవరి 19 : స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు ద్వారా పొందిన రుణాలతో జీవనోపాధి పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.శోభారాణి చెప్పారు. శుక్రవారం ఆమె రేవిడి పంచాయతీ పరిధిలోని రౌతులపాలెంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం, కూరగాయల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందడంతో పాటు వాటిని ఇళ్లలో వినియోగించడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా మండలంలో ఇప్పటివరకు రూ.33 కోట్లు మూడు విడతలుగా ఇచ్చామన్నారు. ఈనెల 23న నాలుగో విడత నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. అనంతరం కుల గణన సర్వేను పరిశీలించారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని కార్యదర్శి రామకృష్ణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటరు సత్యంనాయుడు, ఏపీఎం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్‌పై చిత్రలేఖనం పోటీలు రేపు

వెంకోజీపాలెం, జనవరి 19 : నగరాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దే క్రమంలో ఆదివారం ఎకో వైజాగ్ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అండ్ కన్వెక్షన్స్‌లో జరిగే ఈపోటీలను రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలు ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్‌పై అవగాహన కలిగి ఉన్నప్పుడే పర్యావరణహితమైన నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పోటీల్లో 15 ఏళ్లలోపు వారు జూనియర్ గ్రూప్‌లో, 15 ఏళ్ల పైబడిన వారు సీనియర్ గ్రూప్‌లో పాల్గొనవచ్చని, సీనియర్ గ్రూప్‌లో గెలుపొందిన వారికి రూ. 25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. జూనియర్ గ్రూప్‌లో విజేతలకు రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ.7 వేలు చొప్పున, రెండు గ్రూపుల్లో 50 మందిని ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు.ఆసక్తి గల వారు శనివారంలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలను జీవీఎంసీ టోల్ ఫ్రీ నెంబరు 180042500009 లేదా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల సెల్ నంబర్లు 9000086861, 8555058575 సంప్రతించాలని ఆయన సూచించారు.

సింహగిరిపై కొనసాగిన 'స్వచ్ఛ తీర్థ సేవ'

సింహాచలం, జనవరి 19 : సింహగిరిపై శుక్రవారం కూడా స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు ప్రధాన రాజగోపురానికి ఎదురుగా ఉన్న కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు. అలాగే భక్తులు ఆలయ పరిసరాల్లో పెట్టిన పసుపు కుంకుమలు, దీపారాధనల నూనె జిడ్డులను తొలగించారు. కార్యక్రమంలో ఏఈఓలు నరసింగరావు, భ్రమరాంబ, పర్యవేక్షణాధికారులు శిరిపురపు కనకరాజు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

దోచుకోవడం.. దాచుకోవడమే వైసీపీ పని

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రాంకుమార్



మాట్లాడుతున్న రాంకుమార్

పెదవాల్తేరు,జనవరి 19 : రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే పనిలో బీజేపీ ఉంటే.. వైసీపీ దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రాంకుమార్ విమర్శించారు. శుక్రవారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశాఖను స్మార్ట్ సిటీ చేసి అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందన్నారు. గిరిజన, పెట్రోలియం యూనివర్సిటీలతో పాటు ఐఐఎంలు,ఆనందపురం నుంచి అనకాపల్లి బైపాస్, భోగాపురం ఎయిర్ పోర్టుకు ఆరులేన్ల హైవే,400 బెడ్ల ఈఎస్‌ఐ ఆసుపత్రి, వందేభారత్, అమృత్, డబుల్ డెక్కరు రైళ్లు ప్రవేశపెట్టామన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం రైల్వే జోన్ కోసం కనీసం స్థలం కూడా చూపించడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్ పాలనపై దృష్టిపెట్టకుండా వచ్చే ఎన్నికల కోసం ఎమ్మెల్యేలను బదిలీ చేసే పనిలో ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, జిల్లా మీడియా అధికార ప్రతినిధులు వెన్న శ్రీరామ్మూర్తి, సేనాపతి మహేష్ ఉన్నారు.

'ప్రతిఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావం ఉండాలి'



స్వామిజీకి పాదాభిషేకం

సాగర్‌నగర్, జనవరి 19 : ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావం ఉన్నప్పుడే సమాజంలో శాంతి నెలకొంటోందని అమెరికన్ ఇస్కాన్ గురువు వేదవ్యాస ప్రియస్వామి మహరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన ఇస్కాన్ మందిరంలో భక్తులకు ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సనాతన ధర్మాన్ని ప్రబోధించడమే లక్ష్యంగా నాలుగు రోజుల పాటు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరానికి వచ్చామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు భాగవతం, భగవద్గీతపై ప్రవచనాలు చేస్తామని చెప్పారు.శ్రీకృష్ణుడు భక్తులతో ప్రియంగా ఉంటారని, ఆయనకు ప్రియంగా వుండాలంటే ఉండాల్సిన లక్షణాలను భక్తులకు బోధించారు.తొలుత ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయిసేవని స్వామీజీకి పాదాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జయద్వైత స్వామి మహరాజ్, తదితరులు పాల్గొన్నారు.

తెలగ కులస్థులను బీసీల్లో చేర్చాలని వినతి



పద్మనాభం తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న తెలగ కుల ప్రతినిధులు

పద్మనాభం/ఆనందపురం, జనవరి 19 : మండలంలోని తెలగ కులస్థులు తమను బీసీల్లో చేర్చాలని కోరుతూ పద్మనాభం తహసీల్దార్ వేణుగోపాల్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర తెలగ కుల సంక్షేమ సంఘం పిలుపుమేరకు వినతిపత్రం అందజేసినట్టు వారు చెప్పారు. అన్ని విధాలా వెనుకబడి ఉన్న తమను ఓసీల్లో ఉంచారని, ప్రభుత్వం స్పందించి బీసీల్లో చేర్పించి విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, పుప్పాల అప్పలరాజు, రమణ, సీతారాం, గణేష్, సూరి, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు. అలాగే ఆనందపురంలోనూ కుల ప్రతినిధులు మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కూరాకుల మురళి, వెంకటేష్, సురకత్తుల నారాయణరావు, తాటిశెట్టి దొరబాబు, గుండు మురళి, ఆకుల అబి, మాదాసు వెంకటేష్, కూరాకుల ఉమ పాల్గొన్నారు.

క్రీడాకారుడు పవన్‌కు అభినందనలు



పవన్‌ను సన్మానిస్తున్న వంశీకృష్ణయాదవ్

మద్దిలపాలెం, జనవరి 19 : సౌత్ గోవాలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కె. పవన్‌ను జనసేన పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం శివాజీపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొని బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిప్పల రమణారెడ్డి, పవన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ముత్తంశెట్టి

భీమునిపట్నం, జనవరి 19 : భీమిలి నియోజకవర్గంలో ఈనెల 25న జరిగే సీఎం జగన్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నాయకులు, కార్యకర్తలను కోరారు. శుక్రవారం ఆయన తనక్యాంప్ కార్యాలయంలో భీమిలి మండలం, జీవీ ఎంసీ జోన్ 1 పరిధిలోని వార్డు నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో నాయకులందరితోనూ సమావేశాలు నిర్వహిస్తామని, వాటి వివరాలను త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఆనందపురం, జనవరి 19 : మండలంలోని పందలపాక పంచాయతీలో గంటాపేట - తర్లువాడను కలుపుతూ నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ. 10 లక్షల మంజూరు చేసినట్టు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, చందక ఎంపీటీసీ సభ్యుడు వినినిగిరి అప్పలనాయుడు. ఏఈ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



విద్యార్థులకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ సూర్య ప్రసాద్

భీమునిపట్నం, జనవరి 19 : విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాల ప్రిన్సిపాల్ జి. సూర్యప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో 1969-71లో ఇంటర్ చదివిన మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గత ఏడాది పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె. రామచంద్రరావు, పీఎస్ చంద్, ఎం. రామకృష్ణ, ప్రభాకర్‌రావు, బి. రామకృష్ణారావు, వి. రామకృష్ణారావు, ఎస్. బాబాజీ, తదితరులు పాల్గొన్నారు.

పీవీ చలపతిరావుకు నేతల నివాళి

మద్దిలపాలెం, జనవరి 19 : పిఠాపురం కాలనీలోని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ నివాసంలో బీజేపీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు పీవీ చలపతిరావు వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యేలు గణబాబు, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, నాయకులు విజయానందరెడ్డి, కేశవకాంత్, రమేష్ తదితరులు చలపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేమన పద్యాలు సమాజానికి ఆదర్శం



ఏయూలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, జనవరి 19 : ఏయూలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో వేమన జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆచార్యులు వేమన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి. కన్నయ్య మాట్లాడుతూ వేమన పద్యాలు సరళంగా ఉండి ప్రజల భావాలను వెల్లడి చేస్తాయని చెప్పారు.ముఖ్యంగా సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతులపై ఆయన అక్షరాయుధంతో చైతన్యం కలిగించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం సీనియర్ ఆచార్యులు గజ్జా యోహాన్‌బాబు, ఆచార్య బూసి వెంకటస్వామి, ఆచార్య సీతారత్నం, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త వేమన

భీమునిపట్నం : వేమన పద్యాలు భావితరాలకు కూడా ఆదర్శంగా ఉంటాయని భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్ అన్నారు. కళాశాలలో ఆదర్శ హిందీ ప్రేమి మండలి, కళాశాల యాజమాన్యం సంయుక్తంగా వేమన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి సూర్య ప్రసాద్, హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1839లో మొదటిసారిగా సిపి బ్రౌన్ ద్వారా విశ్వదాభిరామ వినురవేమ...అనే వేమన రాసిన పద్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రజా కవిగా, సంఘ సంస్కర్తగా వేమన సమాజానికి చేసిన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా వేమన జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.



త్రినాథరావును సన్మానిస్తున్న యువకులు, పెద్దలు

సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావుకు సన్మానం

తగరపువలస, జనవరి 19 : ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావును స్థానిక యువకులు శుక్రవారం తగరపువలసలో ఘనంగా సన్మానించారు. త్రినాథరావు ధమాకా, నేనులోకల్, హలో గురూప్రేమకోసమే వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు.ఆయన స్వగ్రామం పద్మనాభంలోని పొట్నూరు. శుక్రవారం వ్యక్తిగత పనుల మీద గ్రామానికి వచ్చిన ఆయన్ను తగరపువలసలో యువకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ ప్రజా రంజకమైన సినిమాలు తీసి ప్రేక్షకుల్ని ఆనందపరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కె. రమేష్, సింగనబంద సర్పంచ్ జీవీ నారాయణ, పద్మనాభం మాజీ ఎంపీపీ కాళ్ల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారుకు బోర్డు ఏర్పాటు



రైతుబజారుకు కొత్తగా ఏర్పాటు చేసిన గేటు, బోర్డు

తగరపువలస, జనవరి 19 : తగరపువలసలో రైతుబజారు ఏర్పాటుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రహరీ నిర్మించిన మార్కెటింగ్ శాఖాధికారులు శుక్రవారం గేటు ఏర్పాటు చేసి, దానికి బోర్డు అమర్చారు. 1.24 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న రైతుబజారులో ఇప్పటివరకు స్థలాన్ని చదును చేయగా దుకాణాలు ఏర్పాటు చేసి, షెడ్‌లు నిర్మించడం, ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఈ పనులన్నీ పూర్తయ్యాక అమ్మకందారుల పేర్లు ఖరారు చేస్తామని అధికారులు తెలిపారు. ఉగాది నాటికి రైతుబజారును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.

చిట్టివలస పేరు మార్పుపై హర్షం

స్థానిక సత్యనారాయణ కొండ సమీపంలో నిర్మిస్తున్న రైతుబజారు స్థలం చిట్టివలస రెవెన్యూ పరిధిలో ఉంది. దీంతో దీనికి చిట్టివలస పేరు పెట్టాలని ఆ ప్రాంతానికి చెందిన బల్ల వెంకటరావు,తదితరులు అధికారులకు విన్నవించారు. ఈమేరకు రైతుబజారు బోర్డుపై చిట్టివలస పేరు రాశారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిట్టివలసలో ఉన్న కొన్ని కార్యాలయాలు ఇంకా తగరపువలస పేరుతోనే కొనసాగుతున్నాయని, వాటి పేర్లు కూడా మార్పు చేయాలని పలువురు కోరుతున్నారు.

అతివేగం ప్రమాదకరం : ట్రాఫిక్ సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 19 : అతివేగం ప్రమాదకరమని ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ కేఎస్‌ఎస్‌వీ ప్రసాద్ అన్నారు.ప్రజా రవాణా శాఖ (పీటీడీ) రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం మద్దిలపాలెం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో బస్సులను 25 కిలోమీటర్ల వేగానికి మించి నడపరాదన్నారు. రెడ్ సిగ్నల్ జంప్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, బస్సులు రివర్స్‌లో నడిపేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిపో మేనేజర్ అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ గణేశ్‌రెడ్డి, డ్రైవర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇసుకతోటలో ఘనంగా నెత్తల పరస



పరసలో విక్రయిస్తున్న వస్తువులు

వెంకోజీపాలెం, జనవరి 19 : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో శుక్రవారం నెత్తల పరస ఘనంగా జరిగింది. గ్రామంలోని సూరిశెట్టి కుటుంబీకులు నిర్మించిన నంది ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన పరసలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు గృహోపకరణాలను విక్రయించారు. ఉత్సవం సందర్భంగా గ్రామం మధ్యలో ఉన్న రామాలయాన్ని, నంది ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా మండలి కార్యవర్గ సభ్యులు ముగడ వాసు, పల్లా ఉమారాణి, నారు గోపి, ఈగల సత్యం, బొట్టా శివ, బొట్టా గణేష్, పల్లా త్రినాథరావు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోలులో అక్రమాలను అరికట్టాలి'

పద్మనాభం (రూరల్), జనవరి 19 : మండలంలోని పాండ్రంగిలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. కేంద్రం నిర్వాహకులు 80 కిలోల బస్తా ధాన్యానికి అదనంగా మరో రెండు నుంచి ఐదు కిలోల వరకు తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఎక్కువ బస్తాలు వేసిన రైతులకు వేలల్లో ఆర్థిక నష్టం కలుగుతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.